ఆంధ్రమహిళ

ఏకైక మహిళాభ్యుదయ మాస పత్రిక

(10)

November

1962

నవంబరు

★


'Andhra Mahila'

Vol. XVIII

No. 11

★

37 nP



ఆంధ్ర మహిళ

ఏకైక మహిళాభ్యుదయ

మాస పత్రిక

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్
వ్యవస్థాపకురాలు

విషయ సూచిక

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 18 :: నవంబరు 1962 :: సంచిక 11

శ్రద్ధాంజలి

డాక్టర్. పి. సుబ్బరాయన్ అక్టోబర్ ఆరవ తేదీన మరణించారు.

శ్రీ సుబ్బరాయన్ రాజకీయ చతురుడు, న్యాయవాది. జమిందారు, మంచి క్రికెట్ ఆటగాడు. ఈయన మరణం దేశంలోని పలు సంస్థలకి తీరనిలోటు కలిగించింది. మంచి క్రికెట్ ఆటగాడే గాక యీయన కృషివల్లనే మన దేశానికి అంతర్జాతీయ క్రీడారంగంలో పేరు ప్రతిష్టలు గలిగాయి.

కేంద్రంలో శ్రీ సుబ్బరాయన్ రవాణా సమాచార శాఖ మంత్రిగా నున్నప్పుడే 'ఫారెన్ టూరిస్ట్ హాస్టల్' పథకాలు జనన మొందినాయి.

ఆయన ప్రోత్సాహ సహాకారాల వల్లనే దేశంలోని పెద్దపట్టణాల్లో ఫారెన్ టూరిస్ట్ హాస్టల్స్ వెలిసే అవకాశం కలిగింది.

అటువంటి హాస్టల్ భవనాల్లో తొలుదొల్త భవనం అడయారులో ఆంధ్ర మహిళా సంస్థ అధ్వర్యాన కట్టబడుతున్నది. మొన్న జరిగిన ఆంధ్రమహిళాసభ రజతోత్సవ సభల సమయంలో రెండవనాడు శ్రీ సుబ్బరాయన్ యీ భవనానికి శంఖుస్థాపన జరిపారు.

భవంతుల నిర్మాణం జరుగుతుండగానే, వారి కలలూ, మా సభ కలలూ నిజం కాకుండా శ్రీ సుబ్బరాయన్ దీర్ఘనిద్ర పోవడం ఎంతయో విచారాన్ని కలుగ జేస్తోంది.

రాజకీయ నాయకుడు, న్యాయవాది, గొప్ప ఆటగాడు. విశేషించి మా ఆంధ్ర మహిళాసభ శ్రేయోభిలాషి అయిన శ్రీ సుబ్బరాయన్ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ వారికుటుంబానికి మా సానుభూతి తెలుపుకుంటున్నాము.

అగరువత్తులు

ప్రాచీన కాలంనుంచీ మన భారతావని సుగంధ ద్రవ్యాలకీ, చీనిచీనాంబరాలకీ, ప్రసిద్ధిగాంచినది. కృత్రిమమైన సెంట్లూ, పెర్‌ఫ్యూములూ ఎన్నివచ్చినప్పటికీ — ఈ సుగంధ ద్రవ్యాల ప్రత్యేకత యీ నాటికీపోలేదు.

సుగంధ ద్రవ్యాలలో అశేష ప్రజానీకం. శుభ అశుభ సమయాలలో కూడా వాడేవి అగరువత్తులు. వీటినే వూదొత్తులు అగరు కడ్డీలు అనికూడా అంటారు. ఈ అగరువత్తుల పరిశ్రమ కుటీరపరిశ్రమల క్రింద వచ్చినా ఈ పరిశ్రమ ద్వారా భారీ ఎత్తున స్వదేశంలోనే గాక విదేశాలనుంచికూడా ధనం లభ్యమవుతున్నది.

అగరువత్తులు కుటీర పరిశ్రమగా, మనదేశంలో అనేకచోట్ల ముఖ్యంగా స్త్రీలకి జీవనోపాధి కల్పిస్తున్నది. ఒక్క మైసూర్ రాష్ట్రంలోనే సంవత్సరానికి షుమారు నాలుగుకోట్ల రూపాయల విలువగల అగరువత్తులు తయారవుతున్నాయి. వీటిల్లో చాలామటుకు మనదేశంలోనే అమ్ముడుపోతున్నాయి. ఇంగ్లండు, అమెరికా, కెనడా, ఇటలీ, ఫ్రాన్సు, మలయా, బర్మా, ఇండో చైనా మొదలుగాగల విదేశాలకికూడా ఎగుమతి అవుతున్నాయి. మైసూర్ రాష్ట్రంల్లో తయారయిన యీ అగరువత్తులు స్వదేశంలోనే గాక, విదేశాలో కూడా బహుళ జనాదరణ పొందుతున్నాయి.

మైసూర్ రాష్ట్రంలోని యీ అగరువత్తుల పరిశ్రమ నలభై వేలమందికి వుపాధికల్పిస్తోంది. ఇందులో అధిక సంఖ్యాకులు స్త్రీలే. తీరికవేళల్లో స్త్రీలకి వుపాధి కల్పించే ఈ కుటీరపరిశ్రమ కొన్ని వేల మందికి అన్నం పెడుతున్నది.

అగరువత్తుల తయారిని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదట వెదురుబద్దలనుంచి- సన్నని పుల్లలు చీల్చుకోడం. ఈ పుల్లలు అగరువత్తులలోపలి భాగంలో వుంటాయన్న మాట. ఈ పుల్లలు చీల్చడానికి సుమారు పన్నెండు వేల మంది స్త్రీలు పని చేస్తున్నారు.

అగరువత్తులని వుంచే పెట్టెలూ, గొట్టాలూ తయారుచేసే విభాగంలో అయిదువేలమంది స్త్రీలు పని చేస్తున్నారు. వీరుగాక పై కాయితాలు, లేబుల్సు అట్టలూ అచ్చువేయడం, మొదలగు ప్రింటింగ్ పనులలో కూడా చాలా మంది స్త్రీలు పని చేస్తున్నారు.

ఈ అగరువత్తుల తయారికై వుపయోగించే సుగంధ ద్రవ్యాలు - ఏ కంపెనీకి ఆ కంపెనీ ప్రత్యేకమైనవి వాడుతారు. ఈ పరిమళాల కలయికని అతి భద్రమైన రహస్యంగా కాపాడుతూంటారు అయా కంపెనీలు. పుల్లలవలె. చీల్చిన వెదురు కడ్డీలకి ముద్దలాగా వున్న యీ సుంగధాన్ని అరిచేతులలో వేసుకు రుద్దుతారు. అన్ని అగరువత్తులూ వొకే మందాన వుండేటట్టు సువాసన ద్రవ్యాన్ని పట్టించడం వీరికి అనుభవంతో అలవడేటువంటి విద్య. ఇట్లా తయారైన వాటిని చెక్కల మధ్య నొక్కి గాలిపాటున ఆరబెడతారు. ఆపైన వందా, యాభై, పాతిక యిలా కట్టలూ పాకెట్లూ కట్టి భద్రపరుస్తారు. వీటిని తూచికూడా కట్టలు కడతారు.

ఈ అగరువత్తుల పరిశ్రమ మనకి సువాసనతో ఆహ్లాదము కలిగించడమే కాక కొన్ని వేల మంది స్త్రీలకి వుపాధి సౌకర్యాలుకూడా కలిపిస్తున్నది.

సువాసనభరితములైన యీ అగరువత్తులు విలాస వస్తువులని భావించకండి. విలాసంతోపాటు కొన్ని వేల మంది స్త్రీలకి అన్నంపెడుతున్నదీ పరిశ్రమ.

సిల్వర్ జూబ్లీ హాలు

ఆంధ్రమహిళాసభ, నర్సింగ్‌హోమ్‌లోని సిల్వర్ జూబ్లీహాలులో సెప్టెంబరు 18. వ. తేదీన అమెరికా సమాచారశాఖ ఆధ్వర్యాన రెండు చిన్నచలన చిత్రాలు చూపబడినాయి. యిండియన్ ట్రైనిడ్ నర్సెస్ ఎసోసియేషన్ అధ్యక్షురాలు మిస్ పాల్ ఆనాటి కార్యక్రమంలో విద్యార్థినర్సుల నుద్దేశించి ప్రసంగించారు 'ది. కాల్' చారు. ఈ సందర్భంలో అధ్యక్షురాలు, నర్సుల గ్రంథాలయానికి ఒక పుస్తకాన్ని కూడా బహూకరించారు.

సెప్టెంబరు మాసంలోనే మైలాపూర్ ఎకాడమీ ఆధ్వర్యాన శ్రీయుతులు. గోపాల్, మురుగానందమ్ గార్లు మిమికరీ (అనుకరణ) ప్రదర్శన జరిపారు. వివిధ రకాలైన వీరి అనుకరణని, రోగులు. విద్యార్థినులు, ముఖ్యంగా అర్థోపెడిక్ సెంటర్‌లోని మా చిన్నపిల్లలు,

హైదరాబాదులోని మా సభ విశేషాల


ఆంధ్ర మహిళాసభ హైద్రాబాద్ శాఖ బర్కత్‌పురాలోని సభ హాస్టల్ భవనంలో అక్టోబరు రెండున గాంధీజీ జయంతోత్సవాలు జరుపుకున్నది. అఖిలభారత మహిళా సమావేశపు వుపాధ్యక్షురాలు శ్రీమతి సి. చంద్రమతీదేవి ఆనాటి సభకి అధ్యక్షతవహించారు. గీతా పఠనం తోనూ, రామనామ సంకీర్తనతోనూ ఆనాటి సమావేశము ప్రారంభమయింది. విద్యార్థినులూ, సభ్యురాండ్రు సూత్రయజ్ఞంలో పాల్గొన్నారు. ఆనాటి సమావేశానికి శ్రీమతులు మాడపాటి మాణిక్యాంబ, సరస్వతీరావు, డి. శారదాదేవి మున్నగువారు విచ్చేశారు.

అధ్యక్షురాలు చంద్రమతీదేవి బాపూజీ జీవితంలోని కొన్ని ముఖ్యఘట్టాలు సభ్యురాండ్రకు తెలుపుతూ, పూజ్యదంపతులైన బాపూజీ కస్తూరిబాల ఆదర్శమార్గాన స్త్రీలందరూ నడవాలని ప్రబోధించారు. మహిళా సభలో శిక్షణపొందుతున్న విద్యార్థినులని వుద్దేశిస్తూ కస్తూరిబా సాంగత్యమూ, సహచర్యమూ, సహనమూగనక లేకపోతే గాంధీజీకి, తమ ఆదర్శాలని, అహింసని ఆచరణలోపెట్టి జీవించడం సాధ్యమయి వుండేదికాదు అన్నారు.

ఆంధ్ర మహిళాసభ సహాయ కార్యదర్శిని శ్రీమతి కె. సుగుణమణి, కుల, మత, భాషా, ప్రాంతీయ విద్వేషాలు మాని స్త్రీలందరూ ఐక్యకంఠంతో దేశసమైక్యతకీ తద్వారా ప్రపంచశాంతికీ పాటుబడాలని వుద్బోధిస్తూ, ఆనాడు సభకి విచ్చేసిన సభికులకి తమ అభినందనలు తెలిపారు. జనగణమన గీతంతో ఆనాటి జయంతోత్సవ సభ ముగిసింది.

ఆంధ్ర మహిళాసభ అన్నిశాఖలలో దసరా వుత్సవాలు జరిగినాయి. మద్రాసులోని విద్యాలయంలో బొమ్మలకొలువు వుత్సవం జరిగినది. సభికురాండ్రూ, పలువురు పరిచయస్తులూ, శ్రేయోభిలాషులూ మా కొలువు చూడటానికివిచ్చేసి చందన తాంబూలాదులు స్వీకరించారు.

ఆంధ్రమహిళాసభ హైద్రాబాద్ శాఖలో దసరా వుత్సవాలు జరిగినాయి. ఈ సందర్భంలో బొమ్మల కొలువూ, చేతిపనుల వస్తుప్రదర్శనా, చేనేత వస్త్రాల ప్రదర్శనా కూడా జరిగింది. ఈ ప్రదర్శనని అసంఖ్యాకులైన పురప్రముఖులు తిలకించారు. బొమ్మలకొలువులోని రామాయణ, మహాభారత, భాగవతములలోని ముఖ్యఘట్టాలు పలువురిని ఆకర్షించడమే కాక ప్రశంసలు, కూడా పొందినాయి. ఈ ప్రదర్శనలోని చేతిపనుల వస్తువులూ, చేనేత వస్త్రాలూ మొదలగునవి అక్టోబరు అయిదవ తేదీవరకూ విక్రయించబడినాయి. ఈ ప్రదర్శనకి విచ్చేసి యిందలి వస్తువులను ఖరీదు చేసిన అసంఖ్యాకులైన సోదర సోదరీమణులకి మా కృతజ్ఞతాభివందనములు.



★

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన డాక్టర్ సుబ్బరాయన్ మరణం భారత ప్రజల కొరకు తీరనిలోటు. అనేక రంగాలలో వారు జరిపిన నిర్మాణాత్మక కృషి ఎన్నటికీ మరువురానిది. డాక్టర్ సుబ్బరాయన్ ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి మా గాఢ సంతాపం తెలియబరుస్తున్నాము.

★

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the Month of September 1962

OUT-PATIENT DEPARTMENT:—

No. of Surgical cases treated		42
,, ,, Medical ,, ,,		778
,, ,, Ante-natal ,, ,,		282
,, ,, Post-natal ,, ,,		49
,, ,, E.E.N.T. ,, ,,		33
,, ,, Gyneac ,, ,,		88
,, ,, Dental ,, ,,		7
Total ,, ,, New Patients treated		1,279
,, ,, ,, Old ,, ,,		1,809
	Grand Total	3,088

ADMISSION REGISTER:—

No. of Patients admitted for Normal Delivery		149
,, ,, ,, ,, ,, Abnormal Delivery Manual Removal of placutocal Forceps	4	5
,, ,, Ante-natal casese False pains Treated		20
,, ,, Ante-natal cases Treated Toxeamia ,,		5
,, ,, Medical ,, ,,		21
,, ,, Post-Natal ,, ,,		4
,, ,, Gyneac Cases Treated		13
,, ,, Surgical Cases Treated		5
,, ,, Babies admitted as Lodgers		158
	Grand Total	380

(True Copy)

Sd. Dr. K. R. AMBUJA (Sd.) Dr. M. PAVANA BAI (Sd.) B. TIMMABAI

పాప

కె. వి. యస్. అచ్యుతవల్లి

"పాపా? పాపా?"

అమ్మ పిలుస్తోంది నన్ను. ప్రక్కన కూర్చున్న శారద నాకేసి ఆశ్చర్యంగా చూసింది.

"ఇంకా నువ్వు బుల్లిపాపవనే మీ మదర్ వుద్దేశ్యం కాబోలు" అన్నది నవ్వుతూ.

ఎవళ్ల తల్లితండ్రులకి వాళ్ల పిల్లలు ఎన్నిఏళ్లు వచ్చినా చిన్నపిల్లల్లా కనపడుతారు. ఈ ముద్దు పేర్లతో పిల్లలు పెద్దయినాక పిలిస్తే, క్రొత్తగా వినేవాళ్లకి హాస్యాస్పదంగా వుండొచ్చును. చిట్టీ, పొట్టీ, చిన్నీ, పాపా, బాబూ, అన్నపేర్లు చక్కటి చిన్నచిన్న అందాల పాపలకు వర్తిస్తాయ్! నేను నవ్వి వూరుకున్నాను.

"ఒసే! పాపా! అల్లా కూర్చున్నా వేం! మూడయిపోలా కాఫీలు పట్టుకెళ్లు!" అమ్మ మళ్ళీ కేకేసింది.

ఈసారి శారద వూరుకోలేదు.

"మీ బుల్లి పాప కాఫీలు ఎల్లా తేగల్దు పిన్నీ! నేడి కాఫీ, కాళ్లమీద వొలికేసు చేసేను. మీరే తెచ్చీయండి" అన్నది. శారదకి నాతో ఈమధ్యనే, నేస్తం అయ్యింది. అంచేత నాలో కలిగే సంచలనాన్ని ఆమె అవగతం చేసుకోలేదు. అనుకున్నాను. అమ్మ కాఫీ తెచ్చిచ్చింది. ఇద్దరం తీసుకున్నాం.

"అల్లా ఎక్కడికన్నా వెళ్దామా శారదా?" అడిగాను.

"ఏం కథ? షికారుమీద గాలి మళ్లిందా పాపాయి గార్కి?"

"అవును. నువ్వు కారులో షికారుకెళ్లే పాలబుగ్గల పసిదానవి! నువ్వు నేలమీద నడిచే పాపాయి కథలెందుకు చెవినపెడ్తావ్!" సీరియస్‌గా అన్నాను,

"ఏంత కోపమే చిట్టిపాపా? పద. పద. నేనూ నీతోపాటే నేలమీద నడవతల్చుకున్నాను." అంది శారద. ఇద్దరం కోటిపల్లి గేటుదగ్గిరి ఇసుక దిబ్బమీద కూర్చున్నాం. దూరంగా తాటిచెట్ల కావల సూర్యభగవానుడు ఇసుకలో మునిగి పోతున్నాడు. అస్తమయ సూర్యుని అరుణ కాంతులకి తాటిచెట్ల ఆకుల చివర్లు వేడిగా, ఎర్రగా కాలిపోతున్నాయి. నేను అదే చూస్తూ దీరంగా ఆలోచిసున్నాను.

"ఏమిటే ఆమౌనం?" అంది శారద.

"లేక పోతే ఏం చెప్పను? నీకంతా వేళాకోళంక్రింద కనపడుతుందాయే. అర్థం చేసుకుందామన్న జిజ్ఞాస నీలో మృగ్యంగా వున్నది."

"అర్థం చేసుకుంటాను. ప్లీజ్, కహియె!" అన్నది. శారద.

"మరి రెడీయేనా?" అన్నాను.

"యస్! మేడమ్!"

"అనగా అనగా ఒక వూళ్లో, ఒక అమ్మా, నాన్నకి ఒక చిన్న పాపాయి వుండేది. ఎంతో తెల్లగా, బొద్దుగా వుండేది ఆపాప. ఆపాప మెదడు కూడా బొద్దుగానే వుండేది. ఆపాప ఇంట్లో రంగుల బొంగరంలా తిరుగుతూంటే అమ్మా నాన్న "పాపా ! పాపా !" అని పిలిచి ముద్దులాడుతూ మురిసిపోయేవారు. ఇలా వుండగా ఒక రోజు పాపా వాళ్లమ్మ, పాపకి నీళ్లోసి, చక్కగా మిల మిల మెరిసే సాటిన్ గౌను తొడిగి చేతిలో నాలుగు లడ్డుండలు పెట్టి "పాపా! చక్కగా వీధరుగుమీద కూర్చోమ్మా! అని వాకిట్లోకి పంపి తనపని తను చేసుకుంటోంది. పాప బుద్ధిగా లడ్డుండలు తింటూ వీధరుగు మీద కూర్చుంది. ఇంతలో పాపకి ఒక చిన్న కేక విన్పించింది.

"పాపా ! ఎద్దు తొక్కేస్తుయ్యే ! అటు పోబాక," పాప ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసింది. ఏమంటే తను సురక్షితంగా అరుగుమీద కూర్చుందాయె! మరి తన్ని ఎద్దు ఎల్లా తొక్కగలవ్? ఆ కేకయొక్క సంగతి సందర్భాలు తెలుసుకోవాలనిపించింది. ఇంకా చేతిలో రెండు లడ్లు వున్నాయ్. అవి పట్టుకునే ఆకేక వినపడ్డ చోటికి బయలుదేరింది. ఆకేక పశువుల పాకనించి వచ్చిందని గుర్తు పట్టింది. పాకలోకి వెళ్లి నించుంది. పాకలో ఒక వార "యానాది. రామి." పేడ కుమ్ముతోంది. ఒకవార మైసూరెద్దు, సాదా దుక్కిటెద్దు, గడ్డి నములుతున్నయ్. ఏడెనిమిదేళ్ల పిల్ల కంకరరాళ్ల అక్కణ్నించిక్కడికీ, ఇక్కణ్నించక్కడికీ, గి[illegible]టేస్తూ గెంతుతూ ఆడుకుంటోంది. ఎడ్ల కాళ్లమధ్యగా ఆ కంకరరాళ్లు పోయినా ఆ పిల్ల ఏమీ బెదరకుండ ఆ ఎడ్ల కాళ్లమధ్యకి వెళ్లి రాళ్లు తెచ్చుకుని ఆడుకు [illegible]

నల్లగా బొద్దుగా వుంది ఆపిల్ల. రెండువరసల పగడాలు మెడకి గుత్తంగా కట్టివున్నాయి. వొత్తుగా. పీచులా వున్న జుట్టు ముఖంనిండా, చిందర వందరగా పరుచుకొని వున్నది. మురికిగావున్న చిన్న గుడ్డ మొలకి కట్టుకున్నది. పేడకుమ్మకుంటున్న రామి మళ్లీ అన్నది ఆ పిల్లని.

"అక్కడాడొద్దు అన్నాను కాదంటే పాపా? బయటికి పోయి ఆడుకో ; ఎడ్లు కుమ్మేస్తయ్ !"

"ఏయ్ ! రామీ? ఎవర్ని పిలుస్తున్నావ్?" గద్దించి అడిగింది రామిని.

"మా పిల్లదాన్నండీ పాపగోరూ !" అంది రామి. వినయంగా.

"ఛీ! ఛీ! దాన్నలా పిలవకు. నాకు కోపంవస్తూంది." అందిపాప. యానాదిపాప కంకరరాయి పుచ్చుకునే పాప దగ్గరికివచ్చింది.

"నాపేరూ పాపే! ఏంచేత్తా వేటి?" గర్వంగాఅంది. యానాదిపాప. "తంతాను." అందిపాప.

యానాది పాపకి వళ్లుమండింది. చేతులోని కంకర రాయి పుచ్చుకొని సూటిగాపాప ముఖంమీదికి విసరింది. పాప కనుబొమ్మమధ్యకి చీరుకుపోయి రక్తంచెమర్చ సాగింది. పాప అక్కడ్నే చతికిలపడి చేతిలో లడ్డుండలు పారేసి కాళ్లూచేతులూ ఆడిస్తూ గట్టిగా ఏడవటం మొదలెట్టింది. యానాదిపాప క్రిందపారేసిన లడ్డుండలు తీసుకొని పారిపోయింది. యానాది రామి నిర్ఘాంతపోయింది.

"నీ జిమ్మడ! ఏంపోగాల మొచ్చిందే సచ్చిందానా!" అని తిట్టుకుంటూ. గమ్మున పాపని ఎత్తుకుని చీరచెంగుతో పాపనుదుట చెమర్చుతున్న రక్తాన్ని తుడిచి సముదాయిస్తూ, ఇంటికి తీసుక వచ్చింది. పాప ఇంకా గట్టిగా ఏడుస్తూ, "పేడచేతులతో ముట్టుకోకూ!" అని దీర్ఘాలుతీస్తూ రామి గుండెలమీద చేతులువేసి తోస్తూ. క్రిందికీ నారలా సాగిపోతున్నా, రామి ఓపిగ్గా పాపని తీసుకవచ్చి ఇంటరుగుమీద దింపింది. ఇంతలో వాళ్లమ్మా వాకిట్లోకి వచ్చింది. "దేనికే! రాగం మొదలెట్టావ్!" అన్నది. తల్లిని చూడగానే పాపకి ఇంకా దుఃఖం ఎక్కువయ్యి. స్వరస్థాయిని పెంచేసింది. అమ్మ "రామి" కేసి చూసింది.

"ఏంజరిగిందే రామీ?" అడిగింది. రామి నిలువునా "మరంటే, మరంటే సిన్నమ్మోరు పాకలోకి వచ్చేరుండీ." అదింకా మాటలకోసం వెతుక్కునే లోపున అమ్మ పాపకేసి తిరిగింది.

"ప్రొద్దుటే పాకలో ఏంపనే భడవా! అయినా స్నానం చేసిన పిల్లని ఎందుకు ముట్టుకున్నావే రామీ! మళ్లీ దీన్ని స్నానం చేయించి నేనుకూడా స్నానం చేయాల్సిందే కదా! కేకేస్తే నేనే తీసుకవద్దును."

రామి ప్రాణం కాస్త కుదుట పడివుంటుంది.

"ఎడ్లకాడికి పోతన్నారు — గమ్మని లాగీసినాను." అంది. దాని అబద్ధానికి పాపకి ఉక్రోషం వచ్చింది.

"అమ్మా! నన్ను కొట్టేసిందే అదీ!" ఏడుపు సాగించింది. "ఏడిశావ్! వెధవ అభద్దం నువ్వూనూ! అది నిన్ను కొట్టిందా! నాన్న రానీయి. నీ పనిచెప్తా! లోపలికినడు" అని పాపని లాక్కుపోయి నీళ్లకుండులో దింపేసింది. దాని సిల్కుగౌను తడిసిపోయి వంటికి అతుక్కుపోయి పాపకి చలేసిపోయింది. ఆచలితోనే పాపకి యానాది పాప మీద ప్రతీకారం తీర్చుకోవాలన్న వాంఛ గాఢంగా ప్రబలి పోయింది.

అలా కనిపెట్టుకు కూర్చున్న పాపకి ఒకరోజు యానాది పాప గడ్డిమేటు దగ్గర ఒంటిగా కనిపించింది. యానాది పాప తేగలు నములుతూ కూర్చుంది. పాపకి ఎవరో కాల్చిపారేసిన చుట్టముక్క కనపడింది. అది తీసుకుని యానాది పాప వెనకాతలే వెళ్లి దాని నెత్తిన ఆచుట్టముక్కపడేసి "బాబోయ్! పాం! పాం!" అని అరిచింది. యానాది పాప హడిలిపోయింది, లేచి పరుగెత్తబోయి గడ్డివెంటెలు కాళ్లకి అడ్డుపడగా బోర్లగిలా పడిపోయింది. పాప గర్వంగా నడ్డిమీద చేతులుంచుకుని చూస్తూనించుంది. యానాదిపాప గట్టిగా ఏడవటం మొదలెట్టింది. పాపా వాళ్లమ్మ పెరట్లోకి వచ్చింది.

"ఏంచేసావే దాన్ని! బండా! చదువు సంధ్యాలేకుండా మొద్దుల్లే తయారవుతున్నావు. పద లోపలికి అని రెక్కపుచ్చుకుని నాన్న దగ్గరకి తీసుకపోయింది. పాప ముఖం వంచుకు నించుంది.

"ఏమిటే పాపం! అదలా చిన్నబోయిందీ!" అన్నారు నాన్నగారు.

"మీపిల్ల ప్రతాపం ఏంవర్ణించ మంటారు? ఆ శూద్ర పిల్లలతో ఆడటం. వాళ్లని కొట్టటం. తిట్టటం. నేర్చుకు

దీన్ని తీసుకవెళ్లి మావాళ్లింట్లో వదిలెయ్యండి. కాన్వెంట్ లో జేరిపిస్తే మంచిపద్ధతులు అలవాటు అవుతాయి." అంది అమ్మ.

"బెంగెట్టుకుంటుందే పాపం"

"ఏంబెంగ వుండదులెండి. మా చెల్లాయుందికా! ఇక్కడుంటే బాగుపడదు. పిల్ల."

పాప తల్లివేపు బిక్కమొగంవేసి చూసింది. అయినా అమ్మ మనసు కరుగలేదు. పెద్దాళ్ళు ఎంత గారం చేస్తారో, అంత కట్టుదిట్టాల్లోకూడా పెంచుతారు పిల్లల్ని, పాపం పాపని వాళ్ల తాతగారింటికి పంపేసింది. ఆ వెళ్లటం వెళ్లటం, పాప కాన్వెంట్ లో ఎయిత్ స్టాండర్డ్ ప్యాసయినాక మళ్లీ క్రిస్మస్ సెలవుకి వాళ్లవూరువచ్చింది. పాప మంచి పరికిణీలు, జాకెట్లు తీసుకవచ్చింది వెడల్పాటి సాటిన్ రిబ్బన్లుకూడా బోల్డుతెచ్చుకుంది పాప. రెండు రోజులు ఇంట్లో బుద్ధిగా కూర్చుంది. మూడో రోజున పాపకి 'యానాదిపాప' గుర్తుకువచ్చింది. ఆ పిల్ల మూలంగానే తను అమ్మకి దూరంగా గడపాల్సి వొచ్చింది. పాపకి కాన్వెంట్ చదువు నచ్చలేదు. అక్కడి పిల్లలు అంతకన్న నచ్చలేదు. వాళ్లు 'తుమ్మెండా', 'కాకి నీచెర్లో బుడుంగు' ఆడేవారుకాదు. 'స్కిప్పింగ్, స్కిప్పింగ్' అంటూ తాడుతో గెంతులేసేవారు. పాపకి ఆ ఆట వచ్చేదికాదు. గెంతులేయబోయినా తాడు కాలికి మెలేసుకుని పడిపోయేది. 'యానాదిపాప' కనపడితే తన పరికిణీలు, జాకెట్లు రిబ్బన్లు చూపించి బాగా ఏడిపించాలి. దానికేమున్నాయి? మురికి గుడ్డలేకాదూ? ఆడుకుందుకు కంకరరాళ్లూ! ఆ మురికి మొఖానికి అంతకన్న ఏం వస్తయ్?

నెమ్మదిగా పశువులపాకలోకి వెళ్లింది పాప. 'రామి' పశువులపాక వూడుస్తోంది.

"రామీ! ఏంచేస్తున్నావ్!" అంది పాప.

"ఏమండమ్మాయిగోరూ!" అన్నది రామి.

"నీ పాప ఏం చదువుకుంటోందీ!" అడిగింది గర్వంగా.

"రామి" కళ్లమ్మట నీళ్లుకారాయి.

"ఇంకెక్కడి పాపమ్మగోరూ, సచ్చిపోయి నాలుగేళ్లయిపోనాది!" పాపకి ఏడుపువచ్చింది.

"ఎల్లా చచ్చిపోయింది రామీ! జెరం వొచ్చిందా?"

తరువాత పుట్టిన చిన్న చెల్లి జెరంవచ్చి చచ్చిపోవటం తనకి బాగా గుర్తువుంది. తనకి ఎప్పుడు జెరంవచ్చినా చచ్చిపోతానేమో అనుకుంటుంది పాప.

"జెరం రానేదండి. గునపంలాటి పిల్లది సూడనేక ఆబిగమంతుడు దాని జీవాలు లాగీసినాడు. పాము కరిసినాది. మంత్రం ఏయించే లోపునే బిగిసిపోనాది!" తను పాపని "పాము పాము" అని జడిపించింది. నిజంగా పామే కరిచి చచ్చిపోయింది. ఇంక ఆ పాపని తను చూడలేదు. ఈ జన్మకి తనకి విముక్తి లేదు. ఆ పాపని తనెప్పుడు కలుసుకుంటుంది? తను చేసిన తప్పుకి ఎల్లా క్షమార్పణ చెప్పుకునేది? చచ్చిపోయిందని తెలిసేదాకా, ఆ యానాదిపాప ముందు తనవున్నతి ప్రదర్శించాలనే తహ తహతో కొట్టుకపోయిందే! భగవాన్! క్షమించవా!" అనుకుంది. ఆ పాప .

"బాగుంది. ట్రాజిడీ!" ఈజీగా నవ్వేసింది. శారద.

"ఎల్లా నవ్వుతున్నావ్ శారదా! నాకయితే నన్ను ఎవరు "పాపా" అని పిలిచినా, ఆనాటి పాప కళ్ల ముందు తారట్లాడుతుంది. "రామి" తన కూతుర్ని ముద్దుగా "పాపా" అని పిలుచుకుంటూంటే నాకెందుకని కోపం వచ్చిందో, నాకర్థం కాలేదు. ఇప్పుడయితే, ఆ పాప అల్లాచీకూ చింతాలేకుండా, కంకరరాళ్లతో గెంతుతూ ఆడుకుంటుంటే నా హృదయానికి ఆ మురికి పిల్లని గాఢంగా హత్తుకుని ఆ చెంపలని వూపిరి సలవకుండా ముద్దులాడేదాన్ని. పాప ఎంత అదృష్టవంతురాలు? ఈ లోకంలోని కలిమి, బలిమి, ఆమె ఆనంద తరంగాల్ని, కలుషితంచేయిక మునుపే నిత్యసంతోషిగా వెళ్లి పోయింది, నా నుదుట బొట్టు దిద్దుకుంటుంటే నా కనుబొమ్మ మీద మచ్చ, నా పాపని సర్వదా జ్ఞప్తికి తెస్తుంది."

"పాపా! ఇక్కడే్న కూర్చున్నారా? రాత్రి ఎనిమిదయిపోతూంది." అంటూ పార్కునించి ఇంటికి వెళ్లిపోతున్న తమ్ముడు పల్కరించాడు.

"సారీ పాపా ఏం అనుకోకు" అంది శారద. ఇద్దరం లేచి తమ్ముడు సైకిల్ లైటు వెల్తురులో నడవటం సాగించాము. పాప ఈ కథ చదువుకోగలిగితే ఎంత బాగుండేది? అమావాస్య రాత్రి నాడు ఆకాశంమీద వెలిగే కోటి తారకల ముఖాల్లో నా పాపని నేను వెదుకు

అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము

1893 నుంచి లక్షలాది ప్రజలు అమృతాంజనం వాడి, ఎంత అమోఘమైన శక్తి కలదో తెలుసుకుంటున్నారు. అమృతాంజనంలో వాడే ఔషధాలన్నీ అతి శీఘ్రంగా బాధను పశమింప చేయుటయేగాక చాలా హాయివి కూడా కలిగిస్తాయి. హాని కలిగించే పదార్థాలేమీ లేవు కూడా. దగ్గు, జలుబు మొదలైనవి కూడా శీఘ్రంగా ఉపశమిస్తవి. అమృతాంజనం దగ్గర ఉంచే మీ రెటువంటి బాధనైనా జయించవచ్చు.



అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు-4
బొంబాయి-1.
కలకత్తా-7

A-87-1 TELUGU

సాహిత్యమూ సాంస్కృతిక ప్రమాణాలూ

శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతమ్మ

ఆంధ్రమహిళా సభ రజతోత్సవ సందర్భాన రచయిత్రుల సమ్మేళనం జరిగినది. రెండురోజులపాటు జరిగిన ఈ సమావేశంలో సుమారు యిరవై మందిదాకా సోదరీమణులు పాల్గొన్నారు. తొలిరోజున ఆ సమ్మేళన సందర్భంలో "సాహిత్యమూ సాంస్కృతిక విలువలూ" అన్న శీర్షికకింద చదివిన వ్యాసాలు సంగ్రహంగా "ఆంధ్ర మహిళ"లో ప్రచురించాము. ఈ నెలనుంచి రెండవరోజున చదివిన "సాహిత్యమూ సాంస్కృతిక ప్రమాణాలూ" వ్యాసాలని క్రమంగా ప్రచురిస్తున్నాము.

సాహిత్యానికి భావశక్తి ప్రసాదించిన ఉద్యమాలు సంఘసంస్కరణానికి సంబంధించిన ఆయా సూత్రాలను బట్టే ప్రపంచసాహిత్యాలు వేరు యుగాల్లో పరిణతిని పొందినవి.

ఆంధ్రదేశంలో హిందూమతము వలెనే బౌద్ధ మతము, జైనమతము హిందూమతముతో పాటు వృద్ధిపొందినవి. శాతవాహన చక్రవర్తులు యీ మతములకు చేయూతనివ్వటం వల్ల యీ ప్రబోధం ఆశయాలు ఆంధ్రభాషలో వ్యక్తమైనవి, ఇది నన్నయకు వేయి సంవత్సరాలకు ముందు జరిగినది. వైషమ్యాలు చెలరేగడం వల్ల నన్నయకు ముందువృద్ధి చేయబడిన సాహిత్యం దగ్ధమైనది, ఆంధ్రకవిత్వం రెండువేల ఏండ్లకు ముందే తమిళులకు మణిమేఖలా మొదలైన గ్రంథాలున్నట్లుగా ఆంధ్రులకూ అద్భుత గ్రంథాలు రెండువేల సంవత్సరాలకు ముందే ఆంధ్రసాహిత్యంలో అభివృద్ధిపొందినవి.

5 వ శతాబ్దంలో బౌద్ధమహా విద్వాంసుడు బుద్ధఘోషుడువుండేవాడు, అతనుపాళీభాషలోని అరకథకు తెలుగులో వ్యాఖ్యానం చేయబడిందనీ యిది క్రీస్తుపూర్వం 1 వ శతాబ్దంలో ఉందనీ తెలిపెను. దాన్ని బట్టి క్రీస్తుకి పూర్వం 1 వ శతాబ్దం నుంచీ తెలుగు భాషారచన ఉన్నదని బోధపడుచున్నది.

11 వ శతాబ్దంలో నన్నయ భారతము వ్రాసెను. అప్పుడు భారతదేశ పరిస్థితి శోచనీయమైయుండెను, మహమ్మదీయ దండయాత్రలు ఆర్యావర్తంలో తీవ్రంగా విజృంభించగా హిందూమత సంరక్షణ చేయవలసిన బాధ్యత ఆకాలపు భారతీయ చక్రవర్తులపై పడెను. తూర్పు చాళుక్యప్రభువైన రాజరాజ

కలిగిన వాడు. యీ కారణం వలన పంచమవేదమనబడిన మహాభారతమును ఆంధ్రీకరించుటకై ఆయన నన్నయ భట్టును ప్రోత్సహించెను.

ఈ భారతాన్నే తిక్కన మనుమసిద్ధి ప్రోత్సాహము వల్ల, ఎర్రన రెడ్డి రాజుల ప్రోత్సాహము వల్ల ఆంధ్రీకరించిరి.

నన్నయ రచనలో సంస్కృత శబ్దాలకు విశేషమైన ప్రాముఖ్యము నిచ్చెను. తిక్కన జానుతెనుగు పదములకు తన ఆంధ్రీకరణలో ప్రాముఖ్యత నిచ్చెను, ఎర్రన, నన్నయ తిక్కన శక్తులను స్వీయ రచనలో క్రోడీకరించినాడు.

సాహిత్యాన్ని రసభరితంగా పోషించిన మేధాసంపన్నులు కవిత్రయం—వ్యాస నారాయణ గ్రంథమును ఆంధ్రీకరించిరి. వీరు భారతీయ సాహిత్యాన్ని చక్కని రీతుల తీర్చిదిద్ది పండిత పామరులను రంజింపజేసిరి. వీరి ననుసరించి కొందరు కవులు గ్రంథ రచన సాగించి ఆంధ్ర సాహిత్యవేత్తలుగా ప్రఖ్యాతి పొందిరి

సాహిత్యము:- రసభరితమై యౌచిత్య సమన్వితమై వ్యంగభూయిష్టమై యుండవలెను. సహజ సౌందర్యముతో భావనాశక్తితో రసబంధురమైన కావ్యము ఉదాహరణలతో వాటి ప్రతిష్ట నిరూపించవచ్చు. తిక్కన రసబంధురమైన పద్యములు రసికుల హృదయములు రంజింపజేసిన వనుటకు భారతమున కొన్ని ఘట్టములు తార్కాణములు.

రసము యౌచిత్యము ధ్వని యీ మూడింటికే అవినాభావసంబంధ మున్నది. సాహిత్యంలో యౌచిత్యానికి విరుద్ధంకాని శబ్దాలు ఉపయోగించడం, ప

యోగించిన సముచిత శబ్ద బంధురమై పఠితులకు మనస్సు ఉర్రూతలూగించును. శబ్దఅర్థభావముల మేళ వింపుని సాహిత్యానికి వన్నె తెచ్చి పూర్వకవులు కావ్యజగత్తులో స్థిరకీర్తి నార్జించుకున్నారు. ఆరీతి మృదుమధుర పదజాలం సాహిత్యానికి ముఖ్యం, వీర శైవ మతమునకు సంబంధించిన మహోద్యమము, కర్ణాటకంలో విజృంభించుట వలన పాల్కురికి సోమ నాథుడు మొదలగు కవులు ప్రజలకు సుబోధక మగు నట్లుగా బసవ పురాణము మున్నగు గ్రంథములు సులభ ఛందస్సులో ద్విపదలో రచించిరి.

కాకతీయ కాలంలో విద్యానాథు, బమ్మెర పోత రాజు మొదలగు వారు భక్తి భరితమైన గ్రంథములు రచించిరి. కవినాథుడైన శ్రీనాథుడు తన కాలమున స్రవించిన భావశైలి నను సరించి అద్భుత గ్రంథము లను వ్రాసెను.

అటుతర్వాత కృష్ణదేవరాయలు హిందూధర్మ సంరక్షణార్థమును, ప్రధానముగా వైష్ణవ మత పున రుద్ధణమును కాంక్షించి పెద్దనార్యులను ప్రోత్స హించెను. పెద్దన మనుచరిత్ర గంభీర భావ బంధు రముగా రచించెను.

మనుచరిత్రలో హిమవత్పర్వతవర్ణన:

అటజనిగాంచె భూమి సురు
డంబరచుంబి శిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లుఠద
భంగ తరంగ మృదంగనిస్వన

అని వ్రాసిన పద్యసాహిత్యంలో వాడిన పదముల కూర్పులవల్ల అక్షరధ్వనివల్ల గంగా తరంగముల కోలాహల ఘట్టన ధ్వనింప జేస్తూంది.

అష్టదిగ్గజముల ప్రసక్తిని విశేషముగా చెప్పనక్కర లేదు. అనువాదయుగం ప్రబంధ యుగమునకు దారి నిచ్చినది. పురాణమునందలి కథలను తీసుకుని ప్రబంధకవులు నైసర్గికమైన ప్రతిభను, నవనవో న్మేషణమైన ప్రజ్ఞను పురస్కరించుకుని ప్రబంధములను రచించిరి.

కృష్ణదేవరాయులు 1509 మొదలు 29 వరకు పరి పాలించెను. అతనితర్వాత 1565 లో మహోమ్మదీయ సుల్తానుల దండయాత్రవలన హిందూసామ్రాజ్యం వాడు గాదు. అందుచే హిందూసామ్రాజ్యం చీలిక లవుటవల్ల సామంతులు స్వతంత్రరాజ్యములను ఏర్ప రచుకొనిరి.

తంజావూరు పుదుకోట్టై మధురలో నాయక రాజులు పరిపాలించి తెనుగు సాహిత్యానికి విశేష ప్రోత్సాహమిచ్చిరి.

తంజావూరు చక్రవర్తియైన రఘునాథ రాయల ప్రోత్సాహమువల్లన చామకూరి వెంకటకవి మున్నగు వారు ఆంధ్రశారదకు విశేషమైన సేవచేసిరి. వెంకట కవి శైలిపూలసరముల బోలునది. కాలక్రమ మున సహజ శక్తిగల చక్రవర్తులు లేకపోవుటవల్ల 17 వ శతాబ్దంలో తెలుగు సాహిత్యం కుంటుపడింది.

ఆధునికయుగంలో పాశ్చాత్య సాహిత్యం వృద్ధి బొందినది. వంగీయ సాహిత్య రీతులు అనువాదం లోను అనుకరణలోను ఆంధ్రులు అవలంబించిరి.

తెనుగు సాహిత్యంపై ఆంగ్లప్రభావం ఆంగ్లము ద్వారా తదితర సాహిత్యముల ప్రభావం మనసాహితి పై పడినది. నవలా రచనము ఆంగ్ల సాహితినుండియే వీరేశలింగంగారు చిలకమర్తివారు గావించిరి. చిలక మర్తివారి గద్యపద్య సాహిత్యములకు ఎంతో విలువ నిచ్చిరి.

వంగసాహితి మైకేల్ మధుసూధనదత్తు, బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయుడు, రవీంద్రనాధ్ ఠాగూరు, శరచ్చంద్ర చటర్జీ, ప్రభాత్ కుమార్ ముఖర్జీ మొద లగు సుప్రసిద్ధ వంగరచయితల రచనా విధానములను సాహితీ పథమున ముందంజవేసిన ఆంధ్ర రచయితలు అనుకరించిరి. రాజారామమోహన్ కాలము నుండీ సాంఘిక, మతరాజకీయ విప్లవములు భారతదేశములో విజృంభించుటవలన ప్రజావాఙ్మయము మన దేశంలో తల చూపినది.

ప్రాచీనకాలంలో యక్షగానములు,వీధినాటకములు పల పాటలు మొదలైనవి ప్రజా వాఙ్మయంలోనివే. ఇవి ఆంధ్రులకు ప్రత్యేకం నాగరికతా చిహ్నములు ఆంధ్ర జనులకు అమితమైన ఆనందాద్భుత రసములు గూర్చునవి. వీటియొక్క విలువ నేటికీ తీసిపోక దిన దినాభివృద్ధి పొందుతు జీవించియున్నది. ఈ సాహి త్యం ఛందోరీతుల నుల్లఘించినా పండిత పామరుల

కాని నవయుగమున స్థల కాల అవధులు రాలి పడుటవలన, ప్రపంచ జాతులకు సన్నిహితమైన సంబంధములు కల్గుటవలన, యితర వాఙ్మయము పరిచితి సుసాధ్యమగుటవలన, ఆంధ్ర సాహితీ వధూటి నవ్యాళక్తు లను అలవరుచుకుని అపూర్వమైన శోయగముతో నిలసిల్లుచున్నది.

వాల్మీకి వ్యాసులవలె కాళిదాస భవభూతి భారవులు, తెలుగు కవులకు అంతరంగికమైన ప్రోత్సాహమును ప్రసాదించుటచే ఆయా సంస్కృతకావ్యములు ఆంధ్రీకరింప బడినవి.

కాళిదాసు సంస్కృత శాకుంతలము నిండైన భావనాశక్తి కల్గుటచే మనోరంజితమై కవి హృదయముల కదలింప జేస్తూంది. కాళిదాసు సాహిత్య విలువలు ఎప్పటికినీస్తుతి పాత్రములు

సహజ లావణ్యవతియగు శకుంతలను దుష్యంతుడు చూచినప్పుడు. అయే లబ్దం, నేత్రనిర్యాణం, అతనిచే కాళిదాసు పలికించిన అన్ని పల్కులయెడల ఆమె యెడ తనకు గల అభిమానం ఆశ్చర్యం, సంతోషం జనింప జేస్తూంది.

భవభూతి కరుణ రసభరిత మగు కావ్య రచన, కాళిదాసు శృంగార రసమైన కావ్య రచన సాహిత్యానికి వన్నె తెచ్చినవి. ప్రాచీన భారతీయ నాగరికత సంస్కృతముననే యిమిడి యున్నది.

సంస్కృత సాహిత్యము యెడ నేడు ఎల్లరు అభిరుచి చూపుచుండుట ముదావహము. తరతరముల నుండే స్రవించు ఆంధ్ర నాగరికత సాహిత్యసీమల తనివి తుష్టి, పుష్టి, శాంతి మొదలైన కావ్య ఫలముల పండించుట జాతీయ సమృద్ధిపొందుట ఆంధ్ర సాహిత్యమునకు జీవముపోసి ఆంధ్ర సాహిత్య వధూటికి సహజ భూషణముల తొడిగి దేశసౌభాగ్యమునకైమన సాహితీపీఠమున అలంకృత చేయుట మనకర్తవ్యము.

సాహిత్యంలో అంతస్థులు

శ్రీమతి ఆచంట శారదాదేవి

స్టాండర్డ్సస్ ఇన్ లిటరేచర్. ఈపదానికి సాహిత్యంలో అంతస్థులు అని అర్థం చెప్పుకోవచ్చు. మన నాగరికత అభివృద్ధి అయ్యేకొద్దీ మన సాహిత్యం ఒక్కొక్క మెట్టూ పైకి వెళుతుంది. ఈ పరిణామం కేవలం పైపై మెరుగులను బట్టి కాదు. ఉత్తమసాహిత్య స్వరూపంలో కొన్ని విశేషలక్షణాలు ప్రతిఫలిస్తూంటాయి. నానాటికి అభివృద్ధి చెందుతున్న మన సంస్కృతిని చక్కని భాషలో మధురంగా అందరికీ అర్థమయ్యేటట్లు వ్యక్తం చేసేదే ఉత్తమ సాహిత్యం.

సాహిత్యాన్ని ఒక జీవనదితో పోల్చవచ్చును. ఒక్కొక్క వరదకూ ఎంతో కొత్తనీరు వస్తూంటుంది. ఒక్కొక్కప్పుడు ఈ వరద ప్రళయంగా మారి నది యొక్క భౌతిక స్వరూపాన్నే కదల్చివేయవచ్చు. కాని ఆ మార్పు తాత్కాలికమే. వరద వచ్చి వెళ్ళిపోయాక ఆ బురద అంతాపోయి నీరు స్వచ్ఛమయాక నదీమ తల్లి అతికమనీయంగా ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ స్వచ్ఛ ఉత్తమ సంస్కృతిని వ్యక్తంచేయాలంటే కవిగాని కథకుడు గాని తప్పక పాటించాల్సిన లక్షణాలు కొన్ని ఉన్నాయి. సాహిత్యానికి ప్రధానమైనది రమ్యత. రమ్యతను గురించి ప్రాచీనులు కూడా పేర్కొన్నారు. రసాత్మకమైన వాక్యమూ, రమణీయార్థా నిచ్చే శబ్దమూ అదే కావ్యమన్నారు. రమ్యతనుగురించి భేదాభిప్రాయాల కంతగా అవకాశంలేదు. వస్తువు రమ్యంగా ఉండాలి. చెప్పేతీరు రమ్యంగాఉండాలి, చదివేవారికి అనిర్వచనీయమైన ఆనందం కలగాలి. అప్పుడే ఆ రచన సాహిత్యమనిపించు కుంటుంది.

ఈ రమ్యతను ప్రకటించే టప్పుడు నిజాయితీ, దయ, సానుభూతీ ముఖ్యంగా పాటింపదగినవి. మనం చెప్పే ప్రతిమాటలో సత్యం దానంతటదే ప్రస్ఫుట మౌతూండాలి. మనం వెలిబుచ్చే అభిప్రాయాలు ఇతరులయెడ దయతో కూడినవి కావాలి. అంతేకాని వారికి బాధ కలిగించ కూడదు. మనం వ్రాసే ప్రతి అక్షరమూ ఎవరికో ఒకరికి,

ఉండాలి. రచయిత ఈ విలువలను తప్పక పాటించాలని నా అభిప్రాయం. కేవలం ఉన్నది ఉన్నట్లు చెప్పడం మాత్రం నిజాయితీకాదు. చెప్పేది మనః పూర్వకంగా ఉండాలి. మనః పూర్వకంగా ప్రకటించిన భావానికేఎటు వంటి విలువైనా ఉంటుంది.

నేటి రచనలలో నగ్న సత్యాన్ని ప్రకటిస్తున్నామని చెబుతూ బయలుదేరినవి చాలాఉన్నాయి. ఈరచనలలో సత్యముకన్నా నగ్నత్వమే ఎక్కువేమో అనిపిస్తుంది. పరిశీలించిచూస్తే ఈరచనల ఉద్దేశ్యం కేవలం సత్యప్రకటన కాక తాత్కాలిక భావప్రకోపమేనని తెలుస్తుంది. కేవలం జరిగినది జరిగినట్లు, ఉన్నది ఉన్నట్లు వర్ణించడం వల్ల రచయితలు సాధించేది చదువరులలో ఒకరీతి ఉద్రేకాన్ని కలిగించడం మాత్రమే. ఈ ఉద్రేకం ఒకమత్తు మందులాంటిది. ఒకసారి చదివిచూస్తే ఇంకా ఇంకా కావాలనే కోరిక క్రమక్రమంగా ఎక్కువవుతుంది. ఇటువంటి రచనలకు తాత్కాలికంగా బహుజనాదరణ కలిగినా, సాహిత్యదృష్టితో చూస్తే, రచయిత తన రచనా కౌశలాన్ని,భాషాప్రావీణ్యాన్ని దుర్వినియోగంచేస్తున్నాడే కాని సద్వినియోగం చేయడం లేదనిపిస్తుంది. అలాకాక ఉన్నది ఉన్నట్లే వర్ణించినా ఉన్నతభావంతో, ఉన్నత లక్ష్యంతో, ఉదాత్తమైన భాషలో వర్ణిస్తే రచయిత లోకానికి మేలుచేసిన వాడవుతాడు.

ఇంక ఉత్తమ సాహిత్యంలో వ్యక్తి దూషణ ఎంత మాత్రం పనికిరాదు. ఇదుగో నేను సత్యాన్నే చెబుతున్నాను అని చాటుతూ, ఒక్కొక్కవాక్యమూ ఒక్కొక్క బాణంలా వదులుతూ ఇతరులను గాయ పరచనక్కర లేదు. నేటి సాహిత్యంలో వ్యక్తి దూషణ వివిధ రూపాలను ధరిస్తున్నది. అప్రియమైన చేష్టను, సంఘానికి చేటు కలిగించే చేష్టను ఖండించడం అవసరమే. అయినా అది కేవలం వ్యక్తిగతమైనట్లయితే సాహిత్యపు విలువను కోల్పోతుంది. ఎవరి మీదో మనకున్న అలుకను వ్యక్తం చేయడానికి కథలూ, నాటకాలూ వ్రాస్తే, దీని వల్ల మనం కసితీర్చుకుంటున్నామేగాని సాహిత్యసేవచేయడం లేదు. నాదృష్టిలో రావణసమ్మీయం లాంటివి సాహిత్య మనిపించుకోవు. ఇటువంటివే ఈరోజుల్లో క్రొత్త రూపాలలో వెలువడుతున్నాయి.

నేటిసాహిత్యంలో ఇంకొకరకరీతి దుర్వినియోగం. ఇతరులు పడుచున్న కష్టాలను అతిశయంగా వర్ణిస్తూ చదివే వారికి సానుభూతికి బదులు విసుగూ, జుగుప్స కలిగించడం. మిల్లుయజమాని కూలీలను హింసించడమూ, రిక్షా యెక్కిన ధనికుడు రిక్షావాని కష్టాన్ని గుర్తింపక పోవడమూ, ఇలాంటివన్నీ నిజమే అయినా, ఆకూలీల పైనా, అరిక్షావాని పైనా నిజంగా సానుభూతి కలగాలంటే, ఆ మిల్లుయజమాని, ధనికుడు కూలీలు అందరూ కేవలం కట్టెబొమ్మలు కాకూడదు. అవి సజీవంగా ఉండాలి. ఎంతటిక్రూరాత్ముడైనా, ఏమూలో అణుమాత్రం మానవత్వం మరుగుపడి ఉండడం సహజం. అది గుర్తించి రచించినట్లయితే ఇటువంటి రచనలు కూడా ఉత్తమ సాహిత్యశ్రేణిని అందుకుంటాయి.

ప్రతి వ్యక్తి యందూ అపరిమితమైన సానుభూతి కలిగి నిజమైన పరిస్థితులను వారితో కూడా మానసికంగా మనమూ అనుభవింప కలిగితే, మనదృక్పథం మారిపోతుంది. ఈసానుభూతి గల రచన సహృదయులను ఎంతగానో ఆకర్షించి ఆనందాన్ని కలుగజేస్తుంది.

ఈజీవితం ఒక అమూల్యమైన అవకాశం. రచనా కౌశలం ఒక అపూర్వవరం. కొన్ని కొన్ని విశిష్టగుణాలతో ఏదో కొంతశక్తితో నేను జీవయాత్ర సాగిస్తున్నాను, ఈయాత్రలో నాకు కలిగిన అనుభవాలు, ఊహలూ. ఇవిగో మీరే నేను అనే భావంతో, మీకు ఎంత వరకు పనికి వస్తాయో చూడండి అంటున్నట్లు ఉండాలి, ఉత్తమ రచయిత రచన. అప్పుడే అతని రచనలోని ఒక్కొక్క మాటా సహృదయుడైన చదువరి హృదయ తంత్రులను వింతగా మీటుతుంది.

ఉత్తమ రచయిత లోకముతో ఏకమై, తానే లోకమూ, లోకమే తాను అనే భావాన్ని స్వంతం చేసుకోవాలి. కాని అంతటి ఐక్యభావం ఏర్పడ్డా ప్రతి నిమిషము లోకపు తీరును, తాను బయటఉండే నిష్పాక్షికంగా చూడగల సమర్థతను అలవరచు కోవాలి.

నిజాయితీతో, దయతో, సానుభూతితో రమణీయంగా రచించబడిన రచనే ఉత్తమ సాహిత్యం. అది సమకాలిక సంస్కృతికి ప్రతిబింబం.

సాహిత్య ప్రమాణాలు

కొమ్మూరి ఉషారాణి

సాహిత్య ప్రమాణాలు ఎప్పటికప్పుడు దేశంలోని రాజకీయ, ఆర్థిక ప్రమాణాల మీద ఆధారపడి వుంటాయని అనిపిస్తుంది. దేశంలోని ఏ ఇతర రంగంతోనూ సంబంధం లేకుండా సాహిత్యానికి మాత్రం విడిగా ప్రమాణాలంటూ ఉండడం జరగదేమో!

దేశంలోని పరిస్థితులతో పాటు సాహిత్య ప్రమాణాలు మారుతూ వుంటాయి, అంతమాత్రాన ఆనాటి సాహిత్యానికి అగౌరవ పరచడం జరగదు. పురాణాలకీ, ప్రబంధాలకీ జాతీయోద్యమంలో తయారయిన సాహిత్యానికీ, వితంతు వివాహంలాటి సమస్యలు ఆధారంగా తయారయిన రచనలకే వీటన్నిటికీ ఆనాటి ఉత్తమ సాహిత్యంలో గొప్ప స్థానం వుంది. వీటి సాహిత్య ప్రమాణాలలో చాలా తేడా కూడా వుంది కనుక కాలాన్నిబట్టీ దేశంలోని యితర పరిస్థితులనిబట్టీ సాహిత్య ప్రమాణాలు కూడా మారుతూ వుంటాయని అనుకోవాలి, ఎప్పటికప్పుడు సాహిత్య ప్రమాణాలు దిగజారి పోతున్నాయని అనేవారు వుంటూనే వుంటారు. కొత్త సాహిత్య ప్రమాణాలని సులభంగా అంగీకరించలేని వారూ వుంటూనే వుంటారు.

ఈ నాటి సాహిత్య ప్రమాణాలు ఎలా వుండాలి? అనేది ముఖ్యం. నాది చవక బారు సాహిత్యం అనే సమస్య కన్నా ఎటువంటి సాహిత్యం మనకవసరం అని ఆలోచించాలి. మన సాంఘిక పరిస్థితులనీ, మనం ఎదుర్కొనే సమస్యలనూ బట్టి నేటి సాహిత్య ప్రమాణాలని ఏర్పరుచుకోవాలి.

ఒక పురాణమో, ఒక ప్రబంధమో, నేటి మన సమాజానికి ఏ మాత్రం సంబంధం, పోలిక లేని మనుష్యుల్ని గురించి రాస్తే, అది ఈనాటి పరిస్థితులని బట్టి ఉత్తమ సాహిత్యం కాదనిపిస్తుంది. ఏ కొద్దిమంది పండితులకి మాత్రమో అర్థమయేట్లుగా రచనలు చేస్తే, అవి ఈ నాటి సాహిత్య ప్రమాణాలకి దూరమవుతుంది. మనల్ని తికమకలు పెట్టి, మనకి అనుక్షణమూ ఎదురవుతున్న సమస్యల నుంచి దూరమై, మన వాస్తవిక జీవితానికి ఎటువంటి సంబంధమూ లేని రచనలు ఇప్పటి సాహిత్య ప్రమాణాలకి తగవు.

మన కళ్లముందు, మనం చూసే మనుష్యులు, వాళ్ల సమస్యలు, వాళ్ళ బాధలు, వాళ్ళ ఆరాటం, మన కవసరం "ఇది మన సమస్య దీన్ని గుర్తించండి" అని సమాజాన్ని మేల్కొలపాలి.

మన కున్న సమస్యలు ఇన్నీ అన్నీ కావు. లక్షలు వున్నాయి. ప్రత్యేకం స్త్రీల సమస్యలేకాదు. సమాజానికి కంతటికీ సంబంధించిన సమస్యలు ఎన్నో వున్నాయి. ఏ సమస్య అయినా సరే నేడు మనని ఎదుర్కొంటున్నది తీసుకుని సమాజాన్ని ఒక్క అరగుళం ముందుకి జరిపించడానికి మనం ప్రయత్నం చేయాలి. సమాజాభ్యుదయానికి తోడ్పడే రచనలు సాగించాలి. అదే ఈ నాటి సాహిత్యానికి ప్రమాణం.

దేశంలో అక్షరజ్ఞానం పెరుగుతోంది. చదవాలనే ఉత్సాహం జనానికి ఎక్కువవుతోంది. ప్రజలకి సాహిత్యం అందించే సాధనాలు విరివిగా వున్నాయి. ఇప్పటి సాహిత్య వేత్తలు యివన్నీ ఉపయోగించుకోవచ్చు, జనానికి అర్థమయేలా వాళ్ల సమస్యలు తీసుకుని అధిక సంఖ్యాకులకి సాహిత్యం సృష్టిస్తే సాహిత్య ప్రమాణాలు దిగజారి పోతున్నాయన్న భయం అనవసరం అని తోస్తుంది.

పూర్వపు సాహిత్య ప్రమాణాలని మనం ఈ నాడు ఎలా గౌరవిస్తున్నామో, అలాగే రేపు ముందు రాబోయేవారు, ఈ నాటి సాహిత్య ప్రమాణాలని కూడా గౌరవిస్తారు.

* జాతిని ఉత్తేజపరిచి, జాతి పురోగమనానికీ, శ్రేయస్సుకి తోడ్పడే ప్రతి రచనా ఉత్తమ ప్రమాణాలతో కూడుకున్న సాహిత్యమని నా నమ్మకం.

గురివింద గింజలు

"చంద్రిక"

"నారాయణీ! చారుపొడి కాస్త పెట్టవూ" అంటూ వచ్చింది శివమ్మ. వంటింట్లో కూరగాయలు తరుగుతున్న నారాయణి ముఖం చిట్లించుకుంది.

"ఏం కాయలూ బెంగుళూరు వంకాయలేనా?" అంటూ కూరలబుట్టలో చేయి పెట్టింది శివమ్మ.

నారాయణి కంగారుపడుతూ "ఆఁ అవే ఎవరికో ఇవ్వాలని మామగారు...." అని అస్పష్టంగా గొణుగుతూ కూరలబుట్ట పైనపెట్టింది "ఏమిటి పిన్నీ చారుపొడా" అంది.

"ఆఁ అవునమ్మా" దీర్ఘంగా నిట్టూర్చి గోడకానుకుంటూ తన చూపుల్ని అలమార్లో వున్న డబ్బాలవేపు త్రిప్పింది. అలమారు చెక్కలు మూసివుండటం చేత ఆమె పరిశోధన ఫలించలేదు.

"అయ్యో పిన్నీ నిన్నటికే డబ్బాదులపటం అయింది. ఈరోజు మామూలు చారుపెట్టాలనుకున్నా నీకెందుకంత అనుమానం? కావాలంటే డబ్బాచూడు" అంటూ డబ్బా బోర్లించింది నారాయణి.

"ఏం చూడాలిలే. నీది మరీ చాదస్తం. చారుపొడేమయినా బంగారమా దాచుకోటానికి" అంటూనే కాళీ డబ్బాను చూసింది. శివమ్మకు కొద్దిగా చత్వారముగాని లేకుంటే అది కాఫీ పొడుముడబ్బా అని పోల్చగలిగేది.

"చూడు పిన్నీ నీదగ్గరే వుందిగా డబ్బా" అంటూ నవ్వింది.

నారాయణి శివమ్మను టోపీలో వేయగలిగినందుకు చిహ్నమే ఆ విజయహాసం.

"ఏమిటమ్మా అంతనవ్వు? నేనేం డబ్బా చూపమని అడిగానా? నీవు మరీ నేర్చుకుంటున్నావీమధ్య."

"మరేఁ పిన్నీ కాలమేనేర్పుతుంది అన్ని విద్యలునూ."

"అవునుగాని నారాయణీ! భ్రమరాంబ కోడలు వస్తుందటగా ఈరోజు?"

"ఏమో పిన్నీ నాకేం తెలుసు? వాళ్లింటికి ఎదురుగా వున్న నీకు తెలియాలగాని."

"ఊఁ" దీర్ఘంగా నిట్టూర్చి "అంత గొప్పవాళ్లసంగతులు నాబోటివాళ్లకు తెలుస్తాయా తల్లీ" అంది వ్యంగ్యముగా.

"చాల్లేపిన్నీ వీరిగొప్ప ఎవరికి తెలీదు. ఈవూరొచ్చాక ఈశ్వరయ్య అదృష్టం పండి రెండుమేడలు కట్టించాడు. మూడేళ్ల క్రితం స్వంతవూర్లో కారుమొహమైనా చూశాడా ఈనాడు గనుక కారుకొన్నాడుగాని"

"నిజమేననుకో. కాని వాళ్లనుకుంటారా ఆమాట? ఆ భ్రమరాంబకేమి నిక్కే తానొక మహారాణి ననుకుంటుంది. మధ్యాహ్నానికి కోడలు వస్తుందేమో! ఇంట్లో ఆవిడ పెత్తనం చూట్టానికి రెండుకళ్లూ చాలటంలేదు."

"దానికేం పిన్నీ కళ్లజోడు తగిలించుకు చూడు."

"పోవే ఎప్పుడు పరియాచకాలాడుతావ్. ఆమెగారిని నీవు చూశావంటే తెలుస్తుంది. నౌకర్లని దబాయిస్తూ, పనివాళ్లని పురమాయిస్తూ.... అహాహా! జమీందారిణయిందంటే నమ్ము. ఆవచ్చేకోడలు కాస్త గయ్యాళి దయితేగాని తిక్కకుదరదు. ఏమంటావు?" అనిబిగ్గరగా నవ్వుతూ నారాయణిని బలంగావూపింది.

ఆ ఊపుకు తబ్బిబ్బయి సర్దుకుంటూ "ఏమిటో మన మనుకుంటాము గాని ఎవరిరాత వాళ్లదిపిన్నీ" అంది.

"నిజమేనమ్మా. ఎవరిరాతకు ఎవరు బాధ్యులు? ఆ భగవంతుడు తిన్నగా చూడాలిగాని లేకుంటే ఈ ఉలికిపాట్లు, ముడిసిపాట్లు ఎన్నాళ్లు? ఇంతకూ పేరంటానికి పిలుస్తుందంటావా?"

"ఆఁ ఆఁ అందర్నీ పిలుస్తుందిలే. లేకుంటే తనగొప్ప చాటుకోవటమేలా?"

"ఏమిటక్కయ్యా గట్టిగా మాట్లాడేస్తున్నావు" అంటూ రంగంలోకి దిగింది శేషమ్మ. "ఓహో పిన్ని కూడ ఇక్కడేవుందే? అయితే మంచిపట్టులోనే వున్నారనుకుంటా. ఏదో బిగ్గరగా మాట్లాడుతుంటే అల్లా వెళ్లేదాన్ని, ఇలాగే లోపలికివచ్చాను."

"కూర్చో శేషూ. నీవెప్పుడూ పనిమీద వెళ్తూ వస్తావు గాని ఒకనాడైనా మాఇంటికని వచ్చావూ?"

"ఏంచెయ్యనక్కా. నీలా ఒంటరి సంసారమయితే ఫర్వాలేదు. నడుం విరిగేలా చాకిరీవుంటుంది" అంటూ

నేలపై చతికిలబడింది. "ఏమిటో మాట్లాడుతున్నారను కుని వస్తే ఆపేశారేమర్రా" అంది యిద్దర్నిచూసి.

"ఏం మాటలున్నాయమ్మా? అదో భ్రమరాంబ కోడలు వస్తుందటేనూ.... "

"ఎవరుపిన్నీ? వనితా?" కనుబొమ్మలు పైకెత్తింది ప్రశ్నార్థకముగా.

"వనితో వల్లకాడో. ఇదేంకాలమేతల్లీ. ముచ్చటగా ఓదేవుడూ దేవతాలేకుండా సినిమాపేర్లు పెట్టుకుంటు న్నారు. మనుషులు. సినిమా బొమ్మలకేం తీసిపోరులే" అని ముఖాన్ని ముప్పయి వంకర్లు దిప్పింది శివమ్మ.

ఈ సన్ని వేశం శేషమ్మ, నారాయణమ్మలకు మహా నవ్వు తెప్పించింది.

"ఎందుకు పిన్నీ నీకంతకోపం" అంది శేషు బల వంతంగా నవ్వాపుకుంటూ.

ఇంతలో నారాయణి దృష్టి గుమ్మంముందుగా వెళ్తున్న మరిడమ్మమీదపడింది. "ఏమత్తా ఏదోమూట పట్టుకెళ్త న్నావు. ఈలా వచ్చివెళ్లరాదూ?"

"ఏమమ్మా అందరూ తీరికగా కూర్చున్నారు. వంట లయ్యాయా?" నెత్తిమీది చెఱగు సవరించుకుంటూ వచ్చింది.

"వంటలెందుకత్తా నారాయణింట్లోనే భోజనం" ఛలోక్తి విసిరింది శేషు. సమాధానంగా అందరూ నవ్వారు.

"బాగుంది. నాకూ పెట్టారేమిటి" చేతిలోని మూట క్రిందపెట్టూ అడిగింది మరిడమ్మ.

"ఓ పెట్టారత్తా. భ్రమరాంబగారింట్లోనే భోజనాలు" నవ్వాలన్నట్టు నవ్వింది నారాయణి.

"విందుకు పిలిచారా?"

"కోడలొస్తోంది. విందుచెయ్యరేమిటి?"

ఇంతలో అందరి కళ్లూ గుమ్మంమెళ్లెక్కుతున్న పచ్చ పట్టుచీరపై నిలిచాయి, చేతిలో కుంకుమ భరిణతో మొహాన చిఱునవ్వుతో భ్రమరాంబ వచ్చింది. ఆవిడ పసిమి వన్నెఛాయకు బంగారు నగలు మెరుగులు దిద్దాయి. ఆ నడికారు ముత్తయిదువను చూసి అయిన వాళ్లు "లక్ష్మీ అవతారం" అనటం కద్దు. కానివాళ్లకు కన్నెర్రే మరి!

"రండిరండి పెద్దవాళ్లు దారి తప్పి మాయింటికి వచ్చారనుకుంటాను" అని చాప పరచింది నారాయణి.

"అదేమిటండీ అలాగంటారు నేనూ మీలాంటి దాన్నే" అని కూర్చుంది భ్రమరాంబ.

నలుగురి ముఖాలు ఈర్ష్యతో నల్లబడ్డాయి. ఆమె నగల్ని చీరని తదేకంగా చూస్తున్నారు.

"ఏమిటో విశేషమున్నట్టుందే" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో నిశ్శబ్దాన్ని భంగపరచింది నారాయణి

"మా కోడలు వస్తోంది— ఈ రోజు పేరంటానికి పిలుద్దామని వచ్చాను. శివమ్మగారిల్లు తాళంవేసుంది. మరిడమ్మగారింట్లో కోడలున్నారు. శేషమ్మగారి అత్త కనిపించారు దారిలో. అనుకోకుండా ఇక్కడ అందర్నీ కలుసుకోవటమయింది." కుంకుమ అందరికీ పెట్టింది. "వస్తారుగా నారాయణమ్మా. మిమ్మల్నందరినీ పేరు పేరునాపిలవనక్కర లేకుండా మీ ఇంట్లో శుభకార్యంగా భావించండి మరచిపోకండి." చిఱునవ్వుతో అందర్ని వుద్దేశించి చెప్పింది.

ఆమె లేవబోతుండగా నారాయణి అడ్డుకొంటూ "అదేమిటండీ కాస్త కాఫీఅయినా త్రాగివెళ్ళండి" అంది.

"అయ్యో ఇప్పుడెందుకండి భోజనాలవేళ. ఇంకో రెండు గంటల్లో బంధువులు దిగుతారు. వాళ్లందరికీ ఏర్పాట్లు చూడొద్దూ"

"అవునెండి. వియ్యాలవారంటే ఊపిరి తిరుగని పనులు" సమర్థించింది శేషు

"ఇక వస్తానండి మరీమరీ చెపుతున్నాను. మరచిపోక రండి అందరూను." పట్టుచీర గరగరలతో మెట్లు దిగిందావిడ.

"ఎన్నినగలు దిగేసుకుందో చంటిపాపల్లే" మొహం చిట్లించుకుంది శివమ్మ.

"అనుకోకుండా ఇక్కడ కలుసుకుందట. అందరూ ఆమెలాగే నన్నంటబోకు నామాలకాకీ అని వుంటా రనుకుంది కాబోలు, ఒకనాడు మిమ్మల్ని చూడకుంటే నాప్రాణం తన్నుకుంటుందే తల్లీ, మనం ఏలావుండ గలం ఒకర్ని విడిచి ఇంకొకరు?" తమ గాఢస్నేహాన్ని వ్యాఖ్యానించింది మరిడమ్మ.

"డబ్బు చేతిలోవుంటే తమకంటేగొప్పవారు లేరను కుంటారత్తా ఈ కాలంలో. పోనీలే మాట వరసకు

పిలిచింది. మనమూ వెళ్లి చూసొద్దాం ఆ సంబరమూను" అంది నారాయణి.

"వెళ్దాంలే దానికేం" సమర్థించింది శేషు.

"రంగమ్మ కోడలు నలుపుగా. ఈమెగారి కోడలేలా గుందో మరి. కోడలు నలుపయితే కులమంతా నలుపంటారు." తనకు ఎఱ్ఱటి కోడలు దొరికిందనే గర్వం తొణికిసలాడింది మరిడమ్మ మొహంలో.

శివమ్మ నల్లటిమొహం ముడుచుకుంది. "ఏం మాటలే మరిడమ్మా. రంగెవరికి కావాలి గుణంగాని, శేషు చిన్నవదిన ఎఱ్ఱగా రబ్బరు బొమ్మలా లేదూ? దాని షోకులూ అదీ చూడలేకున్నాము. ఎంతఖిలాడీ అనుకున్నావు. ఒక్కగానొక ఆడబిడ్డ శేషు దానికి ఏమీ జరపకుంటేమానె కనీసం ఉగాదికి చీరయినా ఇవ్వలేదట. శేషు పెద్దన్న పెళ్లాం పోయి రెండేండ్లయినా పెళ్లి చేసుకోలేదు ఈ మాయదారి దానికోసం, అలాంటి వాళ్లు బ్రతికి మాత్రంమేంలాభం గుణం లేకుండా?" పెద్ద సమస్య పరిష్కరించినట్టు నిట్టూర్చింది.

శేషు మొహం అవమానంతో నల్లబడింది, తనకు ఉగాదికి చీరివ్వలేదని చిన్నవదినపై అక్కసుకొద్దీ శివమ్మతో నాలుగు మాటలూ కల్పించి చెప్పింది. ఆ మాటలీరూపంలో ఇందరి ఎదుటా వస్తాయని తను కలలోనైనా వూహించలేదు. అసహాయంగా కన్నీళ్లు తుడుచుకుంది.

"ఊరుకో శేషూ ఎవరిపాపాన వాళ్లే పోతారు" నారాయణి ఓదార్చింది.

"ఇక వస్తానక్కయ్యా ప్రొద్దుపోయింది. మా అత్త నాకోసం వూరు వాడా గాలిస్తూ వుండాలి ఈ పాటికి" సంచిదీసుకుంది మరిడమ్మ.

"సాయంత్రమొస్తారుగా" గుర్తుచేసింది నారాయణి.

"వస్తామమ్మా వస్తాము." ఇద్దరితరపునా సమాధానమిచ్చింది మరిడమ్మ.

"మరిడమ్మ రంగమ్మ కోడలు నలుపు చెప్పిందిగాని తన కోడలు కుంటినడక గమనించిందా? ఏంటోనమ్మా అందరూ ఎదుటివారి తప్పులు వెదకుతారు గాని తమ తప్పులు తెలుసుకోలేరు. లోకమంటే ఇంతేనేమో: వేదాంత ధోరణిలో చెపుతూ, ఇంతకూ మీచిన్నాన్నకు చారు ఏలాగ?—అంది."

"నేనుచేశాక పంపిస్తాలే పిన్నీ" అంది నారాయణి.

"వద్దులేమ్మా. మరల ఎవరితో పంపిస్తావు పాపం."

"నేనే వస్తాలేపిన్నీ"

"అయితే నే వెళ్తాను నారాయణీ" అని ఆయాసంగా మెట్లుదిగింది శివమ్మ.

"ఎప్పుడూ దేనికో ఒకదానికి వస్తూవుంటారు బాబూ. ఆచారుపొడి సగం ఈమెకోసమే అయిపోయింది. ఇల్లు గుల్లచేస్తారు ఏం బుద్ధులోగాని" అని గొణుక్కుంటూ చారుపొడిడబ్బాను అలమార్లో వెనకగా దాచింది నారాయణి. నిండుగా వున్నచారుపొడి "మనుష్యలోకం" అని డబ్బాను పలుకరించింది.

"ఊఁ" అంటూ డబ్బా ఊకొట్టింది.

వినతి

ఆంధ్రమహిళ పత్రికలో ప్రచురణార్థం, కథలూ, వ్యాసాలు, నవలలు, ఏకాంకికలూ మొదలైనవి కావలెను. వ్యాసాలు సాధ్యమైనంత వరకూ స్త్రీ సమస్యలకూ స్త్రీ జీవితానికీ సంబంధించినవై వుండాలి. ఆంధ్రమహిళ స్త్రీ రచనలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తుంది. ఈనాడు ఆంధ్రదేశంలో అసంఖ్యాక స్త్రీ రచయితలు వున్నారు. వారు ఆంధ్రమహిళకు తమ అమూల్య రచనలు పంపి మా పత్రిక విజయానికి తోడ్పడగలరని ఆశిస్తున్నాము. ప్రచురించిన వాటికి యథోచిత పారితోషికమీయబడును. రచనలు ఈ దిగువ ఎడ్రసుకి పంపప్రార్థన.

ఎడిటర్ : ఆంధ్రమహిళ

ఆంధ్రమహిళ

ఆంధ్రమహిళాసభ ఆదర్శాలను
 చెప్పెద మిప్పుడు మీకెల్లా
అఖిల భారత స్త్రీలోకమునకు
 వన్నెదెచ్చె వినుడిది యెల్లా, ॥ఆ॥

దుర్గాబాయి ప్రారంభించెను యీ
 మార్గము స్త్రీలకు మేలెంచీ
వర్గ రహిత సమ భావము గూరిచి
 స్వర్గము చేయను మనసుంచీ ॥ఆ॥

॥చాలు॥

॥ రాజుల రాణుల సహకారం॥
రోజు రోజుకు విజయవిహారం।
తాజా పనులకు ఆస్కారం।
॥ తాజేయగ నిలిచెను సంస్కారం॥
మహారాణుల దాతృత్వముచే,
 మహా సంస్థగా వెలిశింది,
మహా మహుల కృషి ఫలితముతో నిది
 మంచి పేరుతా పొందింది॥ ॥ఆ॥

యిరువది యైదు వత్సరాలనా
 డిది ప్రారంభము చిన్నదిగా।
యిరుగు పొరుగుల పిల్లలు వనితల
 ఆటలు పాటల కన్నదిగా ॥ఆ॥

అంచెల వారీ పురోగమించెను
 యఖిల భారత వ్యాప్తముగా
మంచి మంచి శెహబాసుల నందెను
 మహా మహుల ఆశిస్సులుగా ॥ఆ॥

॥చాలు॥

దుర్గాబాయిగారి ఘన సాహసం॥
వర్గ భేదములేని వికాసం।
చల్లని చూపుల దరహాసం।
వెల్లి విరిశెనాయె సాహసం॥

శ్రీమతి దుర్గాబాయిగారికిది
 శ్రీ శ్రీ కీర్తుల తెచ్చింది।
ఆమె పట్టుదల కార్యదీక్షలతో,
 అబలల సబలత హెచ్చింది ॥ఆ॥

భారత భూమిలో నలు మూలలకు
 ప్రాకెను కీర్తులు చెరలాడీ, ॥
భారత స్త్రీలకు వన్నె దెచ్చె నిది
 పరదేశములలో యీనాడు॥ ॥ఆ॥

చదువులు కోరెడి వనితెల కెల్లను
 విధవిధములుగా సహకారం॥
కొదువు లేకనే చేయును వారల
 పురోగతికి తానుపకారం ॥ఆ॥

పిల్లల పెద్దల కెల్లర విద్యకు
 కొల్లగ దోవలు చూపిందీ॥
తల్లివోలె తన చల్లని చూపుల
 నెల్లర పైనను పరపిందీ॥ ॥ఆ॥

అనాథ స్త్రీలకు వృత్తి విద్యల
 నారశి శిక్షణ గరపిందీ॥
మనసులోని మీ భయ విభ్రాంతులు
 మానండిక యని చెప్పింది. ॥ఆ॥

స్త్రీ సంక్షేమము మహిళాభ్యుదయం
 క్షేమమె ప్రధాన కర్తవ్యం॥
స్త్రీ సంఘములో నారోగ్యంబును
 రక్షించుటె తన సర్వస్వం॥ ॥ఆ॥

స్త్రీ వైద్యమునకు పలు విధములుగా
 సేవలు చేయను సంకల్పం॥
గావించెను తన బాధ్యత నితరులు
 గానగ చేశెను ప్రత్యక్షం॥ ॥ఆ॥

Family planning శిక్షణ నిచ్చును
 బహు సంతానము నరికట్టా॥
క్షేమముగద మన కుటుంబ పరిమితి
 సౌఖ్యము శాంతము నిలబెట్టా॥ ॥ఆ॥

వికలాంగులకును వైద్య సహాయము
 విరివిగ జేయును కనుడెల్లా॥
సకల వ్యాధులకు చికిత్సలన్నియు,
 నలుపును దెలియుడు జనులెల్లా ॥ఆ॥

శస్త్ర చికిత్సలు రోగుల మేలుకు
శాస్త్రోక్తముగా జేయగనూ॥
శస్త్ర చికిత్సాలయమును బెట్టెను
సర్వ హంగులతో నమపుగనూ ॥ఆ॥

సహాయ నర్సుల మంత్రసానులకు
సరియగు శిక్షణ నిస్తుందీ॥
అహా! యనెడి పరదేశ వీక్షకుల
నాశ్చర్యములో ముంచిందీ॥ ॥ఆ॥
॥చాలు॥

॥బీద స్త్రీలకొక భాగ్యం॥
బీద రోగుల కిట ఆరోగ్యం।
చేయుట మానవ యోగ్యం।
మన స్త్రీజాతికిది సద్భాగ్యం॥

బీదకుటుంబపు పిల్లల తల్లుల
బాధలు గని మందిస్తుంది॥
భేదము లేకను బీదల ధనికుల
ప్రీతికి గురుత్తై నిలిచిందీ॥ ॥ఆ॥

చిన్న తరగతిలో, పెద్దచదువులో
నెన్నగ శిక్షణ నిస్తుందీ॥
చిన్నా పెద్దా చేతివృత్తుల
చక్కని శిక్షణ గరపిందీ॥ ॥ఆ॥

శాఖ శాఖలుగ కార్యాలయముల
నేకముగా నెల కొల్పిందీ
కాకలు తీరిన మేధావులనే
కార్య కర్తలుగ నిలిపిందీ॥ ॥ఆ॥

ముద్రణాలయము, వృత్తి పత్రిక
మోదముతో నెలకొల్పిందీ
ఆంధ్రమహిళ యను పేరున జగతికి
ఆదర్శము వెద జల్లిందీ॥
॥చాలు॥

నాగేష్ శిశువిహారం।
నర్సరీ స్కూలనే వ్యవహారం।
వనితా బాలవిహారం।
వనితల కిది మనస్సంస్కారం।

చిన్న పాపలకు శిశువిహార మని
వున్నది నాగేష్ శిశువిహారమనీ।
ఎన్నో ఆటల వెన్నో పాటల
చిన్న వారికిది స్వర్గమనీ॥ ॥ఆ॥

వందన కొలది విద్యార్థులతో
వుంది మాధ్యమిక విద్యానిలయం।
కుందు కొరతలు లేక నెల్లర
కందు బాటు కిది ఆదర్శం॥ ॥ఆ॥

ఆదునా తనమె యాట పాటలకు।
నిది పుట్టల్లను చందమనా
యిదే వనితా బాల విహారము
కుదురును మది యానందమునా॥ ॥ఆ॥

ఆటపాటలకు ఆనందాలకు
కూటయా బాల వృద్ధులకూ
విద్యార్థినులకు వుద్యోగులకు
పెద్దలు పిల్లలు కెల్లరకూ॥ ॥ఆ॥

విదేశీయులకు ప్రవాస గృహమిట
వివిధ హంగుల వెలిసిందీ
Andhra Mahila Turist house ని
సాంద్ర మావలకు దెలిసిందీ॥ ॥ఆ॥

రాధా క్రిష్ణ ప్రధాని నెహ్రూ
రాష్ట్ర మంత్రుల మెచ్చికతో
సాధించును ముందెన్నో విధముల
సార్థక కార్యాల్ మచ్చికతో॥

ఆంధ్ర, తమిళ, కర్ణాటక కేరళ
అఖిల భాషల కూడలిగా
ఆచంద్ర తారార్కము నిలువను
అందరు కోరుద మేకముగా ॥ఆ॥

ఆకాశదీపం

మూలం : శ్రీ జయశంకర ప్రసాద్ అనువాదం : శ్రీమతి నిడుమోలు ప్రసూన

బందీ !

"ఆఁ ఏమిటి? అబ్బ ! కాస్త నిద్రపోనిద్దూ !"

"నీకు విడుదల అవాలని వున్నదా?"

"ఇప్పుడే కాదు. నిద్రలేవనీ ! కాస్త శాంతించు."

"మళ్ళీ యిటువంటి సదవకాశం రావదూ!"

"బాగా చలిగావుంది. ఎవరన్నా ఒక కంబళీ కప్పితే బావుండును."

"తుఫాను వచ్చే సూచనలున్నయి. ఇదే మంచి సమయం. నేడు నా బంధనలు పటాపంచలు కాగలవు!"

"ఏమిటీ ! నువ్వుకూడా బందీవా!"

"అవును. నెమ్మదిగా మాట్లాడు. ఈ నావమీద పది మంది నావికులూ, ఒక కాపలాదారూ వున్నారు."

"వీరిని ఎదుర్కోడానికి ఆయుధాలేమయినా దొరుకుతయ్యంటావా?"

"దొరక్కేం చేస్తాయి? కావాలంటే నావకు కట్టిన మోకు తెంపితే సరి !"

"అవును."

సముద్ర తరంగాలు మరింత ఎత్తున లేవడం మొదలు పెట్టినయి. ఆ వూపులో ఈ ఇద్దరు బందీలు ఒకరినొకరు గుద్దుకున్నారు. మొదటివాడు ఎలాగో తన సంకెళ్ళు విప్పుకుని బయటపడ్డాడు. తనతోపాటు రెండవ వానిని గూడా విడుదల చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. తరంగాల వూపులో ఒకరినొకరు దగ్గరగా స్పర్శించుకోవడం వలన మరింత పులకితులవుతున్నారు. స్వతంత్రుల మగుదమనే ప్రబలయిచ్ఛ ! అసంభవమైన ఆలింగనం! కొద్దిసేపటిలో ఇద్దరూకూడా బంధవిముక్తులైనారు. రెండవవాడు హర్షాతిరేకుడై మొదటివాని మెడ వాటేసుకున్నాడు. తక్షణమే——"ఇదేమిటి? నీవు స్త్రీవా?"

"ఏం? స్త్రీ నవడం పాపమా?" అంటూ ప్రక్కకు తప్పుకుంది స్త్రీ.

"నీపేరేమిటి?"

"చంప."

నక్షత్రాలు పొదిగిన నీలాంబరాన్ని మరుగుపరుస్తూ గాలి హోరున వీస్తోంది. సముద్రపుటలల భీషణ సంఘర్షణలో నావ అటూ, యిటూ వూగిసలాడుతూ దాని యిష్టం వచ్చినట్లు పయనిస్తోంది.

స్త్రీ తూలుతూ నిద్రమత్తులోనున్న నావికుని వద్దకు వచ్చి జాగ్రత్తగా అతని ఒడిలోని కృపాణాన్ని నెమ్మదిగా లాక్కుని మళ్ళీ తూలుతూ బందీ దగ్గరకు చేరింది. ఇంతలోనే నావికుడులేచి "తుఫాను ! తుఫాను !" అంటూ పెద బొబ్బలు పెట్టాడు.

అపత్తును సూచించే యీల మ్రోగింది. అందరూ వారి వారి జాగ్రత్తల్లో వున్నారు. బందీ యువకుడు అలాగే పడివున్నాడు. ఒకరు త్రాడు పట్టుకుంటే మరొకరు తెరచాప విప్పుతున్నారు. యువక బందీ లేచి తూలుతూ మోకు దగ్గరకు చేరుకున్నాడు. అదే తెరచాపకూ నావకూ కట్టిన మోకు.

నక్షత్రాలు కనుపించడం లేదు. అలలు ఘోషిస్తూ వువ్వెత్తున లేస్తున్నాయి. పెనుగాలి పిశాచంవలె నావను తనచేతిలో పెట్టుకుని బంతి ఆడుతున్నట్లు యిటూ అటూ తోస్తూ అట్టహాసం చేస్తోంది. అలల తాకిడికి లేస్తూ పడుతూ నావ దాని యిష్టం వచ్చినట్లు పోతోంది. ఇట్టి వ్యాకుల స్థితిలోగూడా యీ యిద్దరు బందీలూ కిలకిలలాడుతూ నవ్వుకుంటున్నారు. హా హా కారంచేసే యీ పెనుగాలి మోతలో ఇది ఎవరు వింటారు?

2

అనంత జలనిధిపై ఉషాదేవి మధుర కాంతిరేఖలు అప్పుడప్పుడే ప్రస్ఫుటమౌతున్నాయి. బంగారు వన్నెగల ఆ కిరణకాంతులు సాగర తరంగాలమీదపడి వాటికి మరింత శోభను మనోజ్ఞతనూ చేకూరుస్తున్నాయి. సాగరం శాంతించింది. బందీ బంధ విముక్తుడైవుండడము నావికులు చూశారు.

"బుద్ధగుప్తా! నిన్నెవరు విడిపించారు?" అని నాయకుడు ప్రశ్నించాడు.

బుద్ధగుప్తుడు కత్తిచూపుతూ "ఇదిగో! యితనే" నాయకుడు అధికారయుతంగా అన్నాడు "అయితే నిన్ను మళ్ళీ బందీని చేస్తున్నాను."

"ఎందుకు? నావికాధ్యక్షుడైన మణికచంద్రుడు అగాధ సాగర జలంలో కలసిపోయాడు. ఈ నౌకకు

"నువ్వు బందిపోటు దొంగవి! బుద్ధగుప్తా! ఇది ఎన్నటికీ సాధ్యంకాదు." అంటూ అతను వులిక్కిపడి తన కృపాణం కొరకు తడుముకున్నాడు.

చంప ముందరే ఆ కత్తిని లాగివేసియుండుటచే నాయకునివంక కోపంతో చూచింది.

"సరే అయితే నువ్వు ద్వంద్వ యుద్ధానికి సిద్ధమవు. ఎవరు జయిస్తే వారే యీ నౌకకు అధికారి!" అంటూ బుద్ధగుప్తుడు కత్తిని నాయకుడికి యిచ్చివేయమని సౌజ్ఞచేశాడు. చంప అట్లేచేసింది.

భయంకరమైన ద్వంద్వ యుద్ధం ఆరంభమైంది. ఇద్దరూ చురుకైనవారే! బుద్ధగుప్తుడు యింకా ఎక్కువ నిపుణుడుగాబట్టి కత్తి నోట గరుచుకుని శత్రువుని మర్దిస్తున్నాడు. చంప విస్మయభయపూరితయై చూస్తోంది. బుద్ధగుప్తుడు చాకచక్యంగా నాయకుడి కత్తివున్న చేతిని నొక్కిపట్టాడు. హుంకరిస్తూ రెండవచెయ్యి నడుంమీద ఒత్తిపెట్టి వానిని పడవేశాడు. నాయకుని పిరికినేత్రాలు ప్రాణభిక్ష వేడుకున్నాయి. ఆ ప్రభాత అరుణ కిరణాలలో బుద్ధగుప్తుని చేతిలో విజయఖడ్గం మెరిసింది.

"ఏం? ఇప్పుడైనా ఒప్పుకుంటావా? లేదా!" విజయ గర్వంతో అన్నాడు బుద్ధగుప్తుడు.

"నేను నీ అనుచరుణ్ణి. యీ వరుణదేవుని సాక్షిగా నేనెప్పుడూ స్వామిద్రోహం తలపెట్టను" అని దీనంగా వేడుకున్నాడు నాయకుడు.

బుద్ధగుప్తుడు వానిని వదలిపెట్టాడు.

గాయపడిన బుద్ధగుప్తునివద్దకువచ్చి తన స్నిగ్ధ దృష్టితోనూ, కోమలహస్తాలతోనూ అతనిని వేదనారహితుణ్ణిచేసింది చంప. ఆజానుబాహువైన బుద్ధగుప్తుని శరీరంమీద రక్తబిందువులు విజయతిలకంగా భాసించినై.

క్షణకాలం విశ్రాంతి తీసుకుని "మనం యిప్పుడు ఎక్కడున్నాము?" అంటూ ప్రశ్నించాడు బుద్ధగుప్తుడు.

"బాలీద్వీపం చాలా దూరంలోవున్నది. బహుశః మనమేదో క్రొత్తద్వీపాన్ని చేరుకోబోతున్నాము. ఈ ద్వీపం మన మెరుగున్నదికాదు."

"అక్కడకు చేరుకోడానికి ఎన్ని రోజులు పడుతుంది?"

"వాతావరణం అనుకూలంగావుంటే రెండురోజుల్లోనే చేరుకోగలం. అప్పటివరకూ మన ఆహారపదార్థాలు గడవెయ్యమని నాయకుడు నావికులకు ఆజ్ఞాపించాడు. స్వయంగా తనే చుక్కాని పట్టుకుని కూర్చున్నాడు. బుద్ధగుప్తుడు అడిగినదానికి సమాధానంగా నాయకుడు చెప్పనారంభించాడు—"ఈ అపార జలరాశిలో అంతర్నిహితమైన శైలఖండంవుంది. ఏమాత్రం ప్రమత్తతో వున్నా దానిని గుద్దుకుని నౌక ఛిన్నాభిన్నంకాగల అవకాశాలున్నాయి"—అంటూ చెప్పుకుపోతున్నాడు.

3

"వీళ్లు నిన్నెందుకు బందీని చేశారు?"

"వ్యాపారి మణికచంద్రుని పాప కృత్యాల వల్లే!"

"నీ ఇల్లెక్కడ?"

"జాహ్నవీ తటమున, నేను చంపానగరంలోని ఒక క్షత్రియ బాలికను. మానాన్న యీ మణికచంద్రునివద్ద కాపలాదారుగా వుంటూవుండేవాడు. మాఅమ్మ స్వర్గస్తురాలైన తరువాత నేను మానాన్నతోపాటు యీ నావమీదే వుంటూవచ్చాను. ఎనిమిది సంవత్సరాలుగా యీ సముద్రమే నాయిల్లు. నువ్వు ఆక్రమణం జరిపినప్పుడు మానాన్న నీ ముఠాలోని ఏడుగురు జలదస్యులను పరిమార్చి ఆపైన తానూ జలసమాధి గతుడైనాడు. నెల దాటిపోయినది. అప్పటినుంచి నేను ఈ నీలాకాశం క్రింద, నీలజలధిపైన నావికా పరివృతనై నిస్సహాయ స్థితిలో వున్నాను.

"మణికచంద్రుడు ఒకనాడు విషయ వాసనాలోలుడై దుర్భాషలాడాడు. నేనూ నోటికి వచ్చినట్లు తిట్టాను. ఆనాటినుంచీ బందీకృతురాలనై పడివున్నాను" అంటూ చంప రోషంతో వణకిపోయింది.

"చంపా! నేను తామ్రలిప్తకు చెందిన ఒకక్షత్రియుడను. కాని దౌర్భాగ్యవశమున జలదస్యువునై జీవితం గడుపవలసివచ్చింది. సరే, ఇకమీదట నువ్వేమి చెయ్యదలచుకున్నావు?"

"నా భవిష్యత్తును గురించి నేనేమీ వూహించడంలేదు. ఏం కానున్నదో!" చంపనేత్రాలు నిరుద్దేశంగా వున్నయి. ఆమె హృదయంలో సంభ్రమపూర్ణమైన యవ్వనం తన తొలితరంగాన్ని మేల్కొలిపింది.

విడివడిన కుంతలాలు చంప భుజాలమీద చిందరవందరగా పడివుండడం దుర్దాంత గజదొంగ బుద్ధగుప్తుడు

అతను విస్మితుడై తనహృదయాన్ని తడుముకున్నాడు. ఒకకొత్త అనుభూతి; అదే మార్దవత!

"మనం కొత్తద్వీపాన్ని సమీపిస్తున్నా" మని నాయకుని స్వరం వినిపించింది.

సమయానికి నావ వడ్డుచేరుకుంది. చంప నిర్భయంగా క్రిందికి వురికింది. నావికులందరూ కూడా దిగారు. "ఈ ద్వీపానికి గనుక యిప్పటివరకూ పేరులేకపోతే చంపా ద్వీపం అందా" మని బుద్ధగుప్తుడు గర్వంగా అన్నాడు. చంప కిలకిలనవ్వింది.

4

ఐదు సంవత్సరాల తరువాత.

అనంత విశ్వమంతటా శరల్లక్ష్మి తాండవమాడుతున్న వెన్నెలరాత్రి అది. అంతరిక్షంలో ధవళ తారికలు మినుకుమినుకుమంటున్నయి.

చంపాద్వీపంలో ఒక ఎత్తయినసౌధంలో చంపకూర్చుని దీపం వెలిగిస్తోంది. ఎంతో ప్రయత్నంమీద అభ్రకపు గుమ్మటంలో దీపంపెట్టి తన మృదుహస్తాలతో దానిని పైకిలాగింది. ఆ దీపాధారం పైకిలేచింది. హర్షాతి రిక్తమైన చంప కల్లాకపటమెరుగని నేత్రాలతో ఆదీపం పైకి పోవడం చూస్తోంది. త్రాడు నెమ్మది నెమ్మదిగా పూర్తిగా లాగింది. తన ఆకాశదీపం నక్షత్రాలతో ఐక్యమై పోవాలని చంప ఆకాంక్ష. అది ఎలా సంభవమౌతుంది? ఆమె ఆశాపూరిత నయనాలతో ఆకాశదీపం వంక చూస్తోంది.

రజత సాదృశ్యమైన జలరాశిలో ప్రచ్ఛన్నంగా దాగివున్న వజ్రనీలాల శైలఖండం అలల తాకిడికి వికృతంగా ఘోషిస్తోంది. అదృశ్యంగావున్న ఆ మాయావి ఎన్నో నావలను నావికులనూ పొట్టన పెట్టుకుంది.

దూరా తీరాలలోని పల్లెపిల్లల పిల్లనగ్రోవి ఝుంకారం ఆ ఘోషలో కలసి పోతోంది. చంచలమగు ఆజలరాశిలో అభ్రకగుమ్మటపు ప్రతిబింబం అస్తవ్యస్తంగా వున్నట్లు తోచింది చంపకు. తన ఆకాంక్ష నెరవేర్చుకోడానికి ఆకాశదీపాన్ని యింకాపైకి పంపడానికి ప్రయత్నించింది.

ఏమీ తోచక "జయా... జయా...." అంటూ పిలిచింది. చిరునవ్వుతో చామనచాయ అటవీయువతి వచ్చింది. నీలాకాశంలో మలినంలేని తారికా పంక్తులవలే మెరుస్తున్నయి ఆమెపళ్ళు. బుద్ధగుప్తుని ఆజ్ఞానుసారంగా ఆమె చంపను 'రాణీ' అని పిలుస్తుంది.

"మహా నావికులు ఎప్పుడు వస్తారో కనుక్కురా" చంప ఆజ్ఞాపించింది. జయ వెళ్ళింది.

శీతల మలయ మారుతం చంపను పులకితురాలిని చేస్తోంది. ఏదో అనిర్వచనీయమైన అనుభూతితో నేడు ఆమె పరవశమైపోతోంది. ఇంతలోనే ఒక దీర్ఘకాయ పురుషుడు వెనుకనుంచి ఆమె భుజంమీద చెయ్యివేసి ఆమెన చకితురాలిని చేశాడు. "బుద్ధగుప్తా!" అంటూ ఆమె వెనుకకు తిరిగి చూచింది.

"పిచ్చిదానా! ఇప్పటివరకూ చలిలో యిక్కడ వుండి నీవు దీపం వెలిగించడమా? ఎందుకు నీ కింత శ్రమా?"

"క్షీరసాగర శయనుడైన అనంత పద్మనాభుని ఆరాధించుటకు దాసదాసీల చేత ఆకాశదీపం పెట్టించనా! అపచారము గదా!"

"నవ్వొస్తోంది. నువ్వు దీపం వెలిగించి ఎవరికో మార్గం చూపించాలను కున్నట్లున్నావు! ఎవరినైతే భగవంతుడని నమ్ముతున్నావో ఆతనికా?"

"అవును, అతడుకూడా అప్పుడప్పుడు త్రోవ మరచి సంచరిస్తూ వుంటాడు. లేకపోతే యీ బుద్ధగుప్తునికి యింత ఐశ్వర్యమెందుకిస్తాడు?"

"ఇస్తే వచ్చిన నష్టమేముంది? ఈ ద్వీపాధీశ్వరి చంపా రాణీయేగా!"

"ఇప్పుడు బాలీ, జావా, సుమత్రా ద్వీపాల వాణిజ్యం నీ అధికారంలోనే వుందికదా బుద్ధగుప్తా! అయినప్పటికీ నాకు ఆరోజులు జ్ఞాపకం వస్తేనే ఆనందంగావుంటుంది. నీదగ్గర ఒకేఒక్క పడవవుండేది. చంపాద్వీపంవద్దున పడవలో సరుకులు నింపుకుని సంతోషంగా సుఖజీవనం గడుపుతూ వుండేవాళ్ళం. ప్రకాశవంతమైన ప్రభాతంలోనూ— చంద్రుని మధుర జ్యోత్స్నలోనూ ఈ నీళ్ళలో మనం మన చిన్నపడవను నృత్యం చేయిస్తూతిరిగేవాళ్ళం. బుద్ధగుప్తా! ఏకాంతమైన ఆ అనంతంలో పల్లెవాళ్ళు ఆదమరచి నిద్రిస్తూవుండేవాళ్ళు. దీపాలు ఆరిపోతూ వుండేవి; అప్పుడు మనమిద్దరమూ అలసటతో డేరాలో పడవగట్టు అనుకుని ఒకరిముఖం ఒకరుచూస్తూ గడిపేవాళ్ళంకదూ? ఆనక్షత్రాల మధురచ్ఛాయ. —"

"సరేగానీ చంపా! మనం యిప్పుడు అంతకంటే ఎన్నోరెట్లు హాయిగా వుండగలుగు తున్నాముగా. నీవు నా ప్రాణధాత్రివి! నాసర్వస్వానివి!"

"కాదు... కాదు అలా ఎన్నటికీ వీల్లేదు! నువ్వు దస్యువృత్తి వదలిపెటావుగాని నీహృదయమాత్రం దయా

విహీనం గానూ సత్కృష్ణతోనూ నిండివుంది. భగవంతుని పేరు చెబితేనే ఎగతాళిగా వుంటుందినీకు, నాఆకాశదీపం మీద వ్యంగం చేస్తావు. బుద్ధగుప్తా! ఆ చీకటి రాత్రులలో ఆకాశంలోని ప్రతిచిన్న కిరణంకోసం మనం ఎంతఆరాట పడేవాళ్ళం? నాకు యింకా జ్ఞాపకంవుంది; నా చిన్నతనంలో మానాన్న ధనోపార్జనకోసం నౌకాయానం చేస్తూ వుండేవాడు. మా అమ్మ మట్టిప్రమిదలో దీపం వెలిగించి గుమ్మటంలోపెట్టి భగీరథివడ్డున పొడుగాటి వాసానికి కట్టి "ఓ అవ్యాజకరుణామూర్తీ! నా నావికునకు అంధకారంలో త్రోవచూపి ఒడ్డుచేర్చుతండ్రీ!" అని ప్రార్థించేది. సంవత్సరాల అనంతరం తిరిగి యిల్లుచేరుకున్నప్పుడు మానాన్న అంటూవుండేవాడు. సాధ్వీ! నీ పూజామహిమ వల్లే అనేకవిపత్తులలో కూడా భగవంతుడు నన్ను కాపాడాడు! అని.

అలా అన్నప్పుడు ఆనందబాష్పాలు రాలుస్తూ గాద్గదికమయ్యేది నాతల్లి! బుద్ధగుప్తా! ఇది ఆమెకై నేచేసే పుణ్యస్మృతే! ధీరుడైన నాతండ్రి మృత్యువుకి కఠోర కారకుడైన ఓ జలదస్యూ! అడ్డులే; ఫో! తక్షణం. చంప చండికవలే వుగ్రురాలయింది. క్రోధపూరితమైన ఆమె నేత్రాలలో నిప్పులు కురిసినట్లయినయి. ఆమె ముఖ వర్చస్సు మారిపోయింది. బుద్ధగుప్తుడు ఆమెని యీఆకృతిలో చూడలేకపోయాడు. ఫక్కున నవ్వాడు.

“ఇది ఏమిటిచంపా! ఇలాగైతే నీ ఆరోగ్యం గూడా చెడిపోగలదు. నిద్రపో” అనిచెప్పి గత్యంతరం లేక అతను అక్కడనుంచి వెళ్ళిపోయాడు. చంప పిడికిలి బిగించి వున్మాదినివలె అటూయిటూ పచార్లుచేసింది.

5

సముద్ర తరంగాలు నిర్జనమైన చెలియలి కట్టను తాకి ఛిన్నాభిన్నమవు తున్నాయి. పశ్చిమపథికుడు అలసిపోయాడు. ఆయన రంగు వెలవెలపోయింది. దివాకరుని ఉన్మీలితప్రకాశ కిరణాలకు విరక్తి చెందిన సాగరం తన శాంత గంభీర విచారంలో మగ్నమయింది.

చంపా, జయా నెమ్మదిగా చెలియలికట్ట దగ్గరకు వచ్చినుంచున్నారు. తరంగాల శీతల సమీరానికి వారి వస్త్రాలు రెపరెపలాడుతున్నాయి. జయ పిలుపుతో ఒక చిన్న పడవ వచ్చింది. వారిద్దరూ దానిమీద కూర్చోగానే పడవవాడు దిగిపోయాడు. జయ తెడు వేయ నారంభించింది. ఉదాసీనమయిన ఆ సముద్ర వాతావరణంలో విచారంగా ఏమిటో ఆలోచిస్తోంది.

‘ఇన్నినీళ్ళు, ఇంత చల్లదనం వున్నప్పటికి నా హృదయ తృష్ణని తీర్చలేక పోతున్నాయి!’ అని అనుకుంది చంప.

చెలియలికట్టని గ్రుద్దుకుని దెబ్బలుతిన్న సముద్రం భీషణఘోషగా బొబ్బలు పెడుతోంది. దినచర్య ముగించిన సూర్యభగవానుడు అనంతజలధిలో మునిగిపోతున్నాడు. ఆరక్తవర్ణ బింబం క్రమక్రమంగా సంధ్య జలంలో విలీనమవడం చంప చూస్తోంది. దీర్ఘమైన వేడి నిట్టూర్పు విడిచి ప్రక్కకు తిరిగింది. బుద్ధగుప్తుని చిన్న పడవ తన నావని సమీపిస్తోంది నావదగ్గరకు రాగానే అతను వంగి చేయూత నిచ్చాడు. చంప అతని సహాయంతో ఆ నావ ఎక్కింది. ఇద్దరూ దగ్గరగా కూర్చున్నారు.

“ఇంత చిన్న పడవలో వంటరిగా యిక్కడ తిరగడం మంచిదికాదు. దగ్గరలోనే జల మగ్నమైన పర్వతం వుంది. ఈ పడవ కర్మ చాలక దానికి గ్రుద్దుకుంటేగాని లేక దానిమీదకు పోతేనో!”

“బుద్ధగుప్తా! అట్లాగనుక జరిగితే మరీమంచిది. సంతోషిస్తాను. కఠోరమైన హర్మ్యాలలో బందీలుగా పడి వుండడం కంటె నీటిలో బందీలుగా వుండడం నయమేగా!”

“నువ్వు ఎంత నిర్దయురాలవు చంపా! నీకోసం క్రొత్త ద్వీపాన్ని సృష్టించగలను, క్రొత్త ప్రజలను అన్వేషించగలను. క్రొత్త రాజ్యాన్నైనా స్థాపిస్తాను. నీశ్రేయస్సుకోసం ఏమిచెయ్యమన్నా సిద్ధమే! నువ్వు ఆజ్ఞాపిస్తే యీకత్తితో నా గుండెకాయని తీసి యీ అగాధ జలంలో పారవేయమన్నా సంసిద్ధుడనే! చంపా నన్ను పరీక్షించి చూడు!”

ఏ బుద్ధగుప్తుని పేరు వినినంత మాత్రాన్నే జావా, సుమత్రా, బాలీ ద్వీపప్రజలు గడగడలాడుదురో ఆధీర గంభీర బుద్ధగుప్తుడు నేడు చంప ఎదుట మోకరిల్లి ప్రేమభిక్ష వేడుకుంటున్నాడు.

పడమటి సంధ్య శైలఖండపు పైభాగం మీద పడినీల పింగళ వర్ణమై భాసిస్తోంది. రమణీయమైన ఆ సంధ్యారుణకాంతులు సముద్ర వక్షస్థల వేదికమీద నృత్యం చేస్తున్నాయి

బాహువులు పెనవేసుకుంది. ఆకాశమూ, సముద్రమూ క్షితిజంలో ఏకమైనట్లు చంపా బుద్ధగుప్తులు ఆలింగనం చేసుకున్నారు. అపూర్వానుభూతినిచ్చే ఆ తొలి పరిరంభంలోనే చంప చైతన్యవతియై తన రవికలో దాచి వుంచిన కత్తి ఒక్కసారిగా బయటకు తీసింది.

"బుద్ధగుప్తా! నీమీద పగతీర్చుకుందామని ఎన్నాళ్ళు నుంచో యీ కత్తిని దాచివుంచాను. కాని ఆ పని చెయ్యడానికి సాహసించలేకపోయాను. ఈరోజున యీ అగమ్య జలధిలోకి నాకత్తి విసిరిపారవేస్తున్నాను. నా హృదయమే నన్ను దగా చేసింది. మాటిమాటికీ మోసపోయాను" తళ తళ మెరుస్తున్న ఆకృపాణం సముద్రరాజు హృదయాన్ని చీల్చుతూ అగాధంలోకి దూసుకుపోయింది.

"చంపా! నన్ను క్షమించావని యిప్పటికైనా నమ్మవచ్చునా?" అని ఆశతోనూ, ఆనందంతోనూ గద్గద స్వరంతో పలికాడు బుద్ధగుప్తుడు.

"వద్దు, బుద్ధగుప్తా! అలా ఎన్నటికీ భావించవద్దు! నేను నా హృదయాన్నే నమ్మలేకపోతున్నాను. అటువంటిది నిన్ను నమ్మమని ఎలా చెప్పగలను? నిన్ను ప్రేమిస్తున్నాను. నీకోసం ప్రాణాలనైనా అర్పిస్తాను. కాని బుద్ధగుప్తా! నువ్వే నాతండ్రి మృతికి కారకుడవని జ్ఞాపకంవచ్చినప్పుడు మాత్రం సహించరాని ఏహ్యత జుగుప్స కలుగుతయి." అంటూ చంప బావురుమని ఏడ్చింది.

బుద్ధగుప్తుడు దీర్ఘ నిశ్వాసవిడుస్తూ "చంపా! నా జీవితంలో మధురమైన యీస్మృతికి చిహ్నంగా యీ పర్వతం మీద ఒక దీపగృహం నిర్మిస్తాను. బహుశః ఆదీపపువెలుగులో నా తమస్సు నశించగలదేమో!

6

చంపా ద్వీపానికి రెండవప్రక్కకూడా విశాలమైన పర్వత పంక్తులు వున్నయి. అవికూడా చాలాభాగం జలమగ్నమై దృశ్యాదృశ్యంగా వున్నయి. చంపాద్వీప ఆదిమనివాసులందరూ నేడు ఆపర్వతంమీద గుమిగూడారు. వారందరూ చంపను వనదేవతవలె శృంగారించారు. నావికుల శ్రేణి వెంట వస్తూవుండగా పువ్వులతో అలంకృతమైన చంప నవ్వుతూ పల్లకీలో పయనమైంది. ఎత్తైన శిఖరం మీద నావికుల శ్రేయస్సుకోసం శాశ్వతమైన దీపగృహం నిర్మించారు. నేడు ఈ కోలాహలం సింహద్వారం వద్ద నిలబడి చేయూతనిచ్చి చంపను పల్లకీలో నుంచి దింపాడు.

వారిరువురూ లోపలకు అడుగిడగానే డప్పు, డోలు మొదలైన వాద్య బృందాలు ఒక్కసారిగా మ్రోగాయి. బారులుతీరిన వనకన్యలు చక్కగా నృత్యం చేశారు.

దీపస్తంభంలోని పైకిటికీలో నుండి బయటకు చూస్తూన్న చంప "జయా!... ఇది ఏమిటి? ఇంతమంది కన్యలను ఎక్కడ నుంచీ పోగుచేశావు?" అని అడిగింది.

"ఇవాళ 'రాణీ' గారి వివాహంకదూ!" అంటూ జయ కిలకిల నవ్వింది.

"ఏమిటిది? నిజమేనా బుద్ధగుప్తా?" చంప కోపంతో అతనిని నిగ్గతీస్తూ అడిగింది.

"నీకు సమ్మతమైతే ఇది నిజమే చంపా! ఎన్ని సంవత్సరాలనుంచో జ్వాలాముఖి వంటి తాపాన్ని నా ఎదలో అణచుకుంటున్నాను."

"చాల్లే వూరుకో, బుద్ధగుప్తా! ఏమిటి యీ దురాగతం? నేను నిస్సహాయురాలనూ, దిక్కులేని దాననూ అనేగా యీ విధంగా వశపరచుకో చూస్తున్నావు?"

"నామాట నమ్ము చంపా! నేను నీతండ్రిని చంపిన హంతకుడను కాను. మరొక బందిపోటు దొంగ చేతిలో నీ తండ్రి గతించాడు."

"నేనే గనుక యీ విషయాన్ని విశ్వసించ గలిగితే బుద్ధగుప్తా! ఈ రోజు ఎంత పర్వదినంగా వుండునో గదా! నువ్వు మహనీయుడవై కొనియాడ బడుతూ వుండేవాడివి! ఫ్చ్!"

జయ క్రిందికి వెళ్ళి పోయింది. స్తంభంలో సన్నని గొందిలో బుద్ధగుప్తుడు చంపా ఏకాంతగా వున్నారు. బుద్ధగుప్తుడు చంప పాదాలమీద వ్రాలాడు, నిట్టూరుస్తూ "చంపా! మన జన్మభూమియైన భారతావనిని వదలి అపారపారావారాన్ని దాటుకుని యింతదూరం వచ్చాము. ఈ అడివి జాతుల వాళ్ళలో మనం ఇంద్రుడు శచీదేవివలె పూజింప బడుతున్నాము. కాని ఏపూర్వ జన్మ కర్మఫలమో; ఏశాప ప్రభావమో! [illegible] యిప్పటివరకూ వేరుచేస్తూనే వచ్చింది. ఆ పుణ్య[illegible] భూమి స్మృతి నిత్యమూ నన్నాకర్షిస్తుంది. కాని నేను వెళ్ళలేక పోయాను. అనిర్వచనీయమైన కాంక్ష నన్ను

ఇంతధన సంపన్ముడ నైనప్పటికీ నీఎదుట నేను బీదవాణ్ణి, బికారిని! శిలాప్రతిమవంటి నాహృదయం ఒకనాడు అనుకోకుండా నీస్పర్శతో చంద్రకాంత మణి వలె ద్రవించింది.

నేను ఈశ్వరుణ్ణి వేడను, పాపాన్ని నమ్మను దయ అనేది ఎలావుంటుందో నాకు తెలియదు అసలు అటువంటి వాటి మీద నాకు విశ్వాసం వుండేది కాదు. అటువంటి మానసిక స్థితిలో నువ్వు ఆశా జ్యోతివలె వుదయించావు. ఆ కాంతి పుంజాలు నాలో చిరునవ్వును తొణికిసలాడింప చేసినయి. అంతటితో నేను సంతృప్తి నొందలేదు. యింకా. ఎక్కువ ఆశించాను... ఇవాళ మనం పెళ్ళి చేసుకుని రేపే భారతదేశం తరలిపోదాం.

ఓడలమీద మన అతులిత ధనరాశి నంతా మూటలు కట్టుకుని మన జన్మభూమికి తరలిపోదాం చంపా! బుద్ధగుప్తుని ఆజ్ఞ సింధుఅలలు కూడా వినకమానవు. అవే దక్షిణ పవనంవలె మనలను భారతదేశం చేరుస్తాయి. పదచంపా, పోదాం!

చంప అతని చేయిపట్టుకుంది. ఆకస్మికమైన తటిల్లత వంటి కంపనము ఒక్కక్షణం వారిద్దరి అధరాలనూ కలిపింది. అలౌకిక తన్మయత! చంప తక్షణం చైతన్యవంతురాలయింది. "బుద్ధగుప్తా! నాకు ప్రత్యేకమైన ఏ ఆకాంక్ష లేదు. ఏకోరికా నా హృదయంలో అగ్నివలె ప్రజ్వలించదు, అంతా సూన్యంగానే తోస్తుంది. నాకు భూమంతా మట్టిగానే కనుపిస్తుంది. ఏజలవాయవైనా శీతలంగానే వుంటుంది. ప్రియమైన బుద్ధగుప్తా! భౌతిక సుఖాలను అనుభవించు. నేను యీ అమాయక ఆటవిక ప్రజలకు సేవచేస్తూ యిక్కడే గడిపేస్తాను. "పోతాను చంపా! పోతాను. నీఎదుట ఎక్కువకాలం వుండి నాహృదయాన్ని అదుపు చేసుకోగలసనే ధైర్యం నాకులేదు. పో.. తాను." బాధగా నిట్టూరుస్తూ మళ్ళీ అతనే అన్నాడు. "చంపా వంటరిగా యిక్కడవుండి ఏమిచేస్తావు?"

ఈ దీపస్తంభంమీద దీపంవెలిగించి ఆ వెలుగులో నా తండ్రిసమాధి ఎక్కడ వుందో అన్వేషించాలనుకున్నాను.కాని ఆకాశదీపంవలె నేనూ ఆహుతి అవవలసి వస్తుందేమో? ఆ మరనాటి ప్రభాత సమయంలో చంప తన దీప స్తంభంమీదనుంచి చూచింది— బుద్ధగుప్తుని నౌకాశ్రేణి చంపాతటంవదలి పశ్చిమోత్తర దిశగా మహాజలవ్యాలం వలె సాగిపోతోంది. చంపనేత్రాలలో అశ్రువులు ధారగా ప్రవహించినయి.

ఇది ఎన్నో శతాబ్దాల పూర్వపుగాధ. చంప, ప్రతి నిత్యమూ ఆకాశదీపం వెలిగిస్తూవుండేది. చివరకు మృత్యుదేవత శాశ్వతంగా చంపను తన వశంచేసుకుంది.

ఆమెను చంపాద్వీపనివాసులు ఇలవేలుపువలె ఆరాధిస్తూవుండేవాళ్ళు.

నాటిక

ఆస్థికోసం

శ్రీ పాలగిరి వేణూజయదేవ్

గత సంచిక తరువాయి

(వెంకట్రావు వీపును తుడుచుకొంటూ ప్రవేశిస్తాడు...)

రా : నమస్కారం మావయ్యా! ....!! శుభోదయం. (అంటూ వంగి సాష్టాంగ నమస్కారం చేస్తాడు; మెడ చుట్టూ వున్న అంగవస్త్రం వెంకట్రావు కాళ్ళక్రింద పడుతుంది. రామరావు లేవబోతాడు గాని లేవలేకపోతాడు....)

వెంక : శీఘ్రమే సంతాన ప్రాప్తిరస్తు!' లే! నాయనా! లే! (రామారావు లేవలేక లేస్తాడు. వెంకట్రావు వెనక్కి జరుగుతాడు.... అంగవస్త్రం విడిపోతుంది....

వెం : పూజ ముగించావురా :

రా : ఓ! .... సూర్యోదయానికి ముందే మేల్కొని స్నానాదులు ముగించి, దేవుని పూజ గావించి, మీ దర్శనార్థమై యిచ్చట వేచి యున్నాడను. మీ దర్శనము లభించినది; సాష్టాంగ నమస్కారములు ఆచరించితిని.. ....మీరు అందుకొంటిరి గదా!....

వెం : నిక్షేపంగా !...

రా : పూజ గావించి రండు, మీరు యేతెంచువరకు నేనిచ్చటనే వేచదను. వచ్చిన పిమ్మట కొంతసేపు పురాణ పారాయణము గావించెదము...; ఏమని నుడివెదరు? ....

వెం : భలేవోడివోయ్! మంచి శాస్త్రివి దొరికావ్?... నేను పూజచేసి వస్తాను.... (లోనికెళ్ళిపోతాడు.)

("వెంకట్రావు హరీ! రామ" అంటూ ప్రవేశిస్తాడు... వెంకట్రావు పళ్ళెంలోని ప్రసాదాన్ని దంపతుల కిద్దరికి యిస్తాడు....)

రా : } హరే! రామ!! రామ! రామ!! హరే హరే!!
శా : } (అంటూ ప్రసాదాన్ని కళ్ళకద్దు కొంటారు..)

[illegible]

సుమారు పదహేను రోజులయిందా! ఐదురోజుల యిందా!!

రా : ఎందుకు మావయ్యా! పదహేనుకు ఐదుకు కలిపితే....

శా : ఇరవై రోజుల .... మీరు వచ్చి

రా : అవునండి... అతురాలా... ఋజు

వెం : సరే! ఈ వూరు గొప్ప పట్టణం గదూ!

రా : అవునండీ! ఇండియాలోని పెద్ద నగరాల్లో యిదొకటి....

వెం : అలాంటి పట్టణములో చూచే వింతలు, వినోదాలు వుంటాయంటావా!

రా : బోలెడన్ని....

వెం : వాటిని చూడాలంటావా! వద్దంటావా!!

రా : తప్పక చూడాలి....

వెం : అయితే ఎపుడు వెళ్దా మంటావ్,?

రా : ఎపుడు దాకా ఎందుకు? ఇపుడే వెళ్దాం....

వెం : మనిషంటే అలా వుండాలాయ్! అమ్మాయ్ శారదా! నీవు కూడా రామ్మా! వెళ్దాం ....

శా : నేనీ వూర్ని పదిసార్లు చుట్టేశాను.... మీరు వెళ్ళిరండి. ఇంతలో వంటచేసి భోజనం సిద్ధంచేసి పెట్టింటాను....

వెం : సరేలే! అమ్మాయ్.!; (రామారావు చెవిలో రహస్యంగా,) నూవైనా పిలవరా!

రా : రా! శారదా!! అలా వెళ్ళొద్దాం. మాకు తోడుగా వుంటావ్....

శా : ఫర్వాలేదు లేండి. మీరు బాబాయిగారు వెళ్ళి రండి. నా కింట్లో బోలేడు పనుంది. వూరుతిరిగి

[illegible]

రా : మళ్ళీ వంటెందుకు? హోటల్లో భోంచేద్దాం....

వెం : ఏమిటి హోటల్లో భోజనంరా! ఛా! ఛా! చూడు అమ్మాయ్! హోటల్ వద్దూ ఆ భోజనం వద్దు. నీవింట్లోనే వుండి వంటచేయమ్మా!,

రా : సరే మామయ్యా వెళ్దాంపద.

వెం : ఈ వేషంలోనట్రా!

రా : సారీ! మామయ్యా! ఒక్క నిముషంలో డ్రస్సు మారుస్తాను.

శా : ఏమండి? మీరు ఆఫీసుకు అలానే వెళ్తారా లేక మామయ్యకు తోడుగా యింటికివచ్చి భోజనం చేసి వెళ్తారా!

రా : మామయ్యకు వూరు చూపించి అలానే ఆఫీసు కెళ్తాను. మామయ్యను రిక్షాలో గాని బస్సులో గాని యింటికి పంపిస్తా! యింటికి రావాలంటే టైముండదు. ఏమంటావ్? మామయ్యా!....!!

వెం : అవున్లే! ఆఫీసునుండి మళ్ళి ఎపుడొస్తా వేమిటి?

శా : మధ్యాహ్నం హాజరులేండి.

(రామారావు లోనికెళ్తాడు;.)

తెరలోంచి "మామయ్యా! వెళ్దాం రండి!" అంటూ కేక.

వెంకట్రావు గొడుగును తీసుకొంటూ "వస్తా. నమ్మాయి," అంటూ వెళ్ళబోతూ, మరిచాను. కాకరకాయపులుసు చేయమ్మా!....! అలాగే కందిపప్పు పచ్చడి, బంగాళదుంప వేపుడు; ఆ! మిరియాల రసం మామూలేగా. చూడు మజ్జిగకు కొంత తిరగమూత వేయమ్మా, మరి నే వస్తా.

శా : ఛస్తున్నాంరా! బాబూ!

(తెర వ్రాలుతుంది)

నాల్గవ రంగం

(శారద కుర్చీలో కూర్చుని వుంటుంది. పరుపు వేసిన ఒక మంచం వుంటుంది. తెరలోంచి అమ్మగోరూ! అమ్మగోరూ!! అంటూ కేకలు వినపడుతాయి. శారద గాభరాగా లేచి తలుపు తీస్తుంది.

శా : ఆ! బాబయ్యో! ఏం జరిగింది? (గాభరాగా) వెంకట్రావు కుంటుకుంటూ ప్రవేశిస్తాడు రిక్షా

వెం : అబ్బా. అబ్బా. ఈ బాధ భరించలేనురా దేవుడా! అబ్బా! అబ్బా!. (శారద, రిక్షావాడూ కలసి వెంకట్రావును స్టేజీమీదున్న మంచంమీద పడుకోబెడతారు, వెంకట్రావు మూల్గుతుంటాడు; శారద విసినకర్రతో విసురుతుంది.)

శా : ఎలా జరిగింది బాబయ్యా!

వెం : అబ్బా! అబ్బా! అబ్బాయి ఆఫీసుకెళ్ళేటపుడు రిక్షాలో కూర్చొని పొమ్మన్నాడు. రిక్షా డబ్బు లెందుకని (మూల్గుతుంటాడు.)

రిక్షా : అవునండమ్మగోరూ! అయ్యగార్ని రిక్షా కావాలా అని అడిగిండు. వద్దురా అని అనిండమ్మ గోరూ! అయ్యగారు అడుగు ముందుకేసిండమ్మ గోరూ! అరటి తొక్కు నా యాల్ది అరటితొక్కు కాలిక్రింద పడిండు, అంతే నండమ్మగోరూ! సరుక్కున కాలు జారి క్రింద పడిండు, పాపం; అపుడే ఓ కారు యమయిస్పీడుగా వచ్చిండమ్మ గోరూ! సడను బేకు వేసిండమ్మగోరు, కానీ అమ్మగోరూ శక్రం అయ్యగారి కాలు రాసు కొండు, అయ్యగారి అడ్రస్సు అడిగి తోలుకోని వచ్చిండమ్మగోరూ!! అంతే నండమ్మగోరూ!

శా : ఏమిటేమిటి కారు ప్రమాదమా! అయ్యో! బాబయ్యా!! (రిక్షావాలా వైపు తిరిగి) నీవిక్కడే వుండు; ప్రక్కింటికెళ్ళు ఫోను చేసివస్తాను (అంటూ కెళ్తుంది.)

శా : (ప్రవేశిస్తూ) ఆ! మావారికి ఫోనుచేశాను డాక్టర్ని తీసుకొనిరమ్మని.

రిక్షా : మంచిపని చేసిండు అమ్మగోరూ! పాపం! ముసిలాడండీ! పట్నంలో ఎలా ఒంటిగా యింటి కొచ్చిండమ్మగారూ! అందులోను కొత్తోడు నే వెళ్తానండి.

శా : ఏమిటో మరి అయోమయంగావుంది. లేచిన వేళ అలాంటిది. నన్ను ఛమ్మన్నారు తోడుగా! వెళ్ళింటే యింతపని జరిగేదికాదు.

(వెంకట్రావు బాధగా మూల్గుతాడు. శారద వెంకట్రావుదగ్గరకెళ్ళి కూర్చొంటుంది.)

శా : ఏమిటి బాబయ్యా! బాధగావుందా! భయపడ

వెం: అబ్బా! అబ్బా! ఏండాక్టర్రో ఏమో! ఇంగ్లీ సోడా.

శా: కాదు బాబయ్యా!

వెం: నేటీ డాక్టరా!

శా: అవును బాబయ్యా!

వెం: వద్దు తల్లీ వద్దు వాని మందులు, గుళికలు వద్దు.

శా: అలా అనకండి.

(వెంకట్రావు మూల్గుతుంటాడు, రామారావు, డాక్టర్ ప్రవేశం)

రా: ఏం జరిగింది?

శా: ఆక్సిడెంటండీ!

రా: ఆక్సిడెంటా! రిక్షాలో వచ్చాడుగా

శా: రాలేదండీ! డబ్బు దండగని

డాక్టర్: రోగి ఎక్కడ?

రా: కనపడలేదేమిటి?

డా: ఓహో!

(డాక్టర్, రామారావు గుండెమీద స్టెతోస్కోపుతో చూస్తాడు.)

రా: నాకు కాదండీ డాక్టర్‌గారూ, మంచం మీదున్నాడు రోగి.

డా: సార్. మీకే ననుకొన్నాను (అంటూ వెంకట్రావు నోరు కష్టంమీద తెరపించి నోట్లో థర్మామీటర్ పెడ్తాడు తీసి చూస్తాడు. స్టెతో స్కోపుతో చూస్తాడు. వెంకట్రావును చెయ్యెత్తి క్రిందకి విడుస్తాడు మోచేతిదగ్గర నాడి దొరికినట్లు నటిస్తాడు.)

రా: ఏమిటండీ! మోచేయిదగ్గర నాడి దొరుకుతుం దేమిటి?

డా: ఫస్ట్‌క్లాసుగా దొరుకుతుంది. మనలో మెదడుంటే వళ్ళంతా దొరుకుతుంది.

రా: ఇంతకూ రోగిని పరీక్షించారా.

డా: పరీక్షచేసేవరకు నిరీక్షించవోయి. చచ్చే రోగికి ఆరునిముషాలు, బ్రతికే రోగికి మూడునిముషాలు పరీక్ష అవసరం. ఏమంటావ్? ఆ! ఆ! (కాగితం మీద ఏదో వ్రాస్తూ మందులకొట్లోకెళ్ళి యీ యింజక్షను తీసుకొనిరండి. ఏమంటావ్?

రా: (కాగితం అందుకొని) అలాగేనండీ. (వెళ్తాడు)

(రామారావు ప్రవేశం చేతిలో చిన్న ప్యాకెట్టుం టుంది.)

రా: ఇదేనండి?

డా: అవును. ఇలా ఈవోయ్. (అంటూ తీసుకొని ఇంజక్షన్ ఇచ్చేందుకు సిరంజి కడిగి ఇంజక్షన్ బాటిల్లోనుంచి మందు తీసుకొని ఆ! రామారావూ! ఈయన వయస్సెంత?

రా: షష్ఠిపూర్తి జరిగి ఇరవై ఏళ్ళయింది.

డా: ఏం ఆక్సిడెంటంటావ్?

రా: అరటితొక్కని శారద చెప్పిందండి. మీరు పరీక్ష చేశారుగా.

డా: పరీక్షకేమిటోయ్! నేను చేశాను. నా ముప్పై ఏళ్ళ సర్వీసులో ఇలాంటి కేసు లెన్నో చూశాను. బజారున బోర్డు కట్టేందుకు కొంచెం స్థలముంటే ప్రతివాడు డాక్టరే ఏమంటాల్?

రా: అవున్లేండి. అలాంటివారిలో తమరుకూడా.

డా: ఛా! ఛా!! నాపేరు గల బోర్డు వ్రాసేందుకు అంటే నాపేరు గులికల వీర వెంకట వరాహ వసంత వైకుంఠమూర్తి. మరి నాబిరుదులో.

శా: అబ్బా! మీ వాగుడుతో మా తల తిరుగు తోంది.

డా: తలేగా. తిరుగనీ తిరుగనీ భూమి గుండ్రంగా వుందని ఋజువు కావడానికి మరొక్క చక్కని నిదర్శనముగా మీ తలను చూపెట్టొచ్చుగా. చూడు రామారావు అలాంటి బోర్డు వ్రాసేందుకు అయింది బోలెడు ఖర్చు.

రా: సరే లే;

డా: ఇంజక్షనిస్తా మరి (అంటూ వెంకట్రావు దగ్గరి కెళ్తాడు.)

వెంక : (ఉన్నట్లుండి) నాకేనా యింజక్షను.

డా : అవునండి,

వెం : నాకు సూది వద్దు. చట్టుబండలూవద్దు.

రా : అలా అనకుమామయ్యా. సూదంటే చీమకరచి నట్లేగా!

వెం : చీమ బాబోయ్. చీమంటే నాకు పాడు భయం.

(రామారావు, శారద వెంకట్రావును గట్టిగా పట్టు కొంటారు. డాక్టర్ సూదివేసి నిట్టూర్పు)

(స్టేజి ముందువైపుకు డాక్టర్, రామారావు వస్తారు)

డా : రామారావూ! ఈ రెండు గుళికలు యిప్పు డివ్వు. చూడు ఈ లేహ్యంతో కాలికి పట్టువేయి మరి; అంతే ఫినిష్ రెండు నిముషాల్లో,

రా : ఏంటి ప్రాణమా!

డా : ఛ! ఛ! అపశకునపు పక్షిలా ఏమిటి కూతలు. సరేలే. ఓ నిజం చెప్తావూ.

రా : ఏమిటో?

డా : ఇంతకూ రోగి బ్రతకాలని వుందా. చావాలని వుందా.

శా : ఏమిటి అలా అంటావ్ ?

డా : ఫర్వాలేదోయ్ చెప్పు.

రా : బ్రతకాలనేవుంది.

డా : అయితే నేనిచ్చిన రెండు గుళికలు ½ శేరు రంగరించి రంగరించి.

రా : అలాగే, ప్రమాదమేమైనా వుంచా.

డా : అంత ప్రమాదంలేదుకానీ జ్వరం వచ్చే సూచ న్లున్నాయి. హాయిగా చచ్చే లక్షణాలు కన్పడి కన్పడునట్లున్నాయనుకో. నే వెళ్తా. (బిగ్గరగా) నే వస్తానండీ వెంకట్రావుగారూ.

(వెళ్ళిపోతాడు. శారద వెంకట్రావుదగ్గరనుంచి రామారావు దగ్గరికెళ్ళి)

శా : ఏమండీ ఏం ప్రమాదం లేదుకదా.

రా : ఏంలేదట.

శా : ఆఫీసుకు వెళ్తారా.

రా : ఓహారం శెలవులుగా.

(వెంకట్రావు మూల్గుతుంటాడు; దంపతులు వెంకట్రావు దగ్గరికెళ్తారు)

రా : ఏం మావయ్యా.

వెం : అబ్బా చచ్చిన పశువును పొడిచినట్లు పొడిచాడు వెధవ.

రా : మొదట్లో బాధేలేండి.

వెం : వెధవ యింజక్షన్లు, గుళికలు. రెండు మంత్రా లేస్తే పోయేది.

రా : మంత్రాలెందుకు మావయ్యా మంత్రాలతో చింతకాయలుకూడా రాలవట.

వెం : అబ్బా డబ్బు దండగ.

(శారద, రామారావు స్టేజి ముందువైపుకు వస్తారు. గోడ క్యాలెండర్లో 23వ తేదీ)

రా : శారదా ఇక ఫలంలేదు. మనకు నాటకం వద్దు బూటకంవద్దు ఎంతఖర్చు, ఎంతఖర్చు మావయ్య జబ్బుతో వేగలేకపోతున్నాం ప్రమాదం జరిగి పది రోజులయిందా ముగ్గురు డాక్టర్లు మారారా! నూటయాభై రూపాయలు ఖర్చయయ్యాయిగాని రోగం తగ్గనూలేదు హెచ్చనూలేదు.

శా : అవునండి. తప్పంతా నాదే! మీరు చెప్పినట్లు మనం ఎక్కడైనా బస చేసుంటే....ఈ ఖర్మ తప్పేది....

రా : చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకొంటే ఏం లాభం ?

శా : సర్లేండి.

రా : సర్లేండి. అంటే నాటకం ముగిసిపోతుందా? ఏమిటి?

శా : నాటకం ముగియక నిలుస్తుందా!

రా : శారద....! ఇంత నాటకం ఆడుతున్నాంగదా! మరి మామయ్య ఆస్తి యింకెవరికైనా వ్రాసి యుంటే....మన నాటకం....మన శ్రమ!

శా : బూడిదలో పోసిన పన్నీరు.

రా : అయితే ! మనకు మార్గమేమిటి ?

శా : మీరు భయపడకండీ ! మనకు తెలిసినంతవరకు ఎవరికి ఆస్తి వ్రాసివ్వలేదు లెండి....

రా : నమ్మమంటావా !

శా : ఆ ? తప్పక డాక్టరేమన్నాడు ?

రా : బాగవుతుందన్నాడు.

శా : ఎపుడు ?

రా : ఖర్మ తీరినపుడు

శా : ఎందుకైనా మంచిది. బాబాయిగారి ప్రాణం పోకముందే వీలునామా వ్రాసి, సంతకం చేయిస్తే,.

రా : వెరీగుడ్ తెలివిలో నా భార్య ననిపించుకొన్నావ్ ! నేనెపుడో వీలునామా తయారు చేశాను. నా కంత తెలివిలేదనుకొన్నావా ! మనకిపుడు కావాల్సింది సంతకం....! ఏమంటావ్ ?

శా : రైటంటాను.

(వెంకట్రావు మూల్గు....శారద, రామారావు మంచందగ్గరికెళ్తారు....)

వెం : అబ్బా ! అబ్బా ! !

(రామారావు టేబుల్ మీదున్న మందుసీసా నందుకొంటాడు)

రా : మావయ్యా ! మందు....నోరు తెరవండి పోస్తాను....

వెం : గంగా జలమా !

రా : అవును మామయ్యా (తమాయించుకొని) కాదు మందు....

వెం : నాకేనట్రా !

రా : అవును మీకే....

శా : తెరువు బాబయ్యా !

రా : తెరువు మామయ్యా ! !

వెం : ఏమిటే !....

రా : } (గట్టిగా) నోరు....
శా : }

(వెంకట్రావు నోరు తెరుస్తాడు ; మందు పోస్తాడు రామారావు)

వెం : ఓరేయి ! రామా నాకు తెల్సురా ! (రామారావు ఉలిక్కిపడ్తాడు.) మీ నాటకం అంతా తెలుసురా !

రా : అంతా తెలుసా మావయ్యా !

వెం : అంతా తెల్సురా ! రామా ! జానకీరామా ! ! నన్ను నీలోకి ఐక్యం చేసుకోతండ్రీ....ఈ నాటకంలో నీ దెంత పాత్రరా ! నామీద దయలేదా ! కరుణాకరా !

వెం : వద్దు....వద్దు....నాకీబాధ వద్దు....జీవించలేను... నేనింక జీవించలేను....

రా : మంచిది మావయ్యా ! సంతకం పెట్టేచాలు...

వెం : పెడ్తారా ! పెడ్తా ! కోటిపెడతా పే ! రామచంద్రా ! నన్ను నీలోకి చేర్చుకోరా !...

శా : ఏమండీ ! ఏమండీ ! సంధి పుట్టిందండీ !

రా : ఏమిటేమిటి సంధా !

శా : జ్వరసంధి.

రా : అయితే ఎలాగే !

(మావయ్యా ! అంటూ వెంకట్రావును కదిపి చూస్తాడు....శారద రంగంలోంచి లోనికెళ్తుంది....)

రా : మావయ్యా !

వెం : ఛీ ! వదలు ! (రామారావు ఉలిక్కిపడి చేయి వదలిపెడ్తాడు) నన్ను మీలోకి తీసుకెళ్తారా !

రా : ఓ ! దీంట్లో సంతకం పెడ్తే...

వెం : నేను వైకుంఠానికే వెళ్ళాలి...

రా : లేదు ! మావయ్యా ! వీలులేదు. సంతకంపెట్టే వైకుంఠానికి వెళ్లు.

వెం : కాదు....నేరాను.....నరకానికి.....పోండ్రా పోండి యమదూతల్లారా !

రా : మరి మా నాటకమో !

వెం : నాటకం ముగిసిందిరా !....! ! నా ప్రాణం పోతూంది....

రా : ప్రాణం పోకూడదు. సంతకంపెట్టేనే ప్రాణం పోవాలి....

వెం : హే ! రామచంద్రా !....

రా : శారదా ! శారదా ! !

(తెరలోంచి "వస్తున్నానండీ !" అంటూ శారద రంగంలోకి ప్రవేసిస్తుంది,)

శా : ఏమండీ?

రా : ఎక్కడికి పోయావ్ ?

శా : ప్రక్కింటింకెళ్ళి డాక్టరుకి ఫోన్‌చేసి వచ్చాను.

రా : ఏమని?

శా : త్వరగా రమ్మని,

రా : సరేలే ! మామయ్యను పట్టుకో ! మావయ్యా ! ఈ వీలునామాలో సంతకం చేయండీ ! !

(శారద వెంకట్రావును పట్టుకొంటుంది. రామారావు పేనాను తీసి, వీలునామాలో సంతకం చేయ మని పెట్టాడు, కాని హే ! రామా ! కృష్ణా ! ! అంటూ వెంకట్రావు పడిపోతాడు.)

డా : ఏమండీ ! ఏం జరిగింది?

శా : బాబయ్యను చూడండీ !

(డాక్టర్, వెంకట్రావు చేయిచూస్తాడు.)

డా : ప్రాణంపోయి రెండు నిముషాలయ్యింది.

(శారద, ఆ ! అంటూ వెంకట్రావుమీద పడి "బాబయ్యా ! బాబయ్యా ! !" అని అరుస్తుంది.

రా : పోయావా మామయ్యా ! ఆస్థికోసం ఎన్ని పాట్లుపడ్డాం. ఎంతకష్టపడ్డాం, నీవు నిజానికి నరకానికి పోతావు. మమ్మల్ని మోసంచేసి నీవు స్వర్గానికి పోతావా ! ఎంత కష్టం, ఈ ఆస్థికోసం ఎన్ని పాట్లు, చచ్చేటపుడైనా వీలునామాలో సంతకం చేయకూడదా !,

డా : ఏడ్వకండీ ! సార్ ! ఏడ్వకండీ ! ! నాచేతిలో ఈ ప్రాణం పోకపోవడం నా దురదృష్టం. నాచేతిలో పోయుంటే ఇది నూరో కేసు అయ్యేది...నా పేరు వుండేది. పేనసా ! బిల్లు పంపిసా !...

రా : మేము ఏడ్చి చస్తుంటే వీని దొకటి...ఆస్థికోసం ఎంత పాటు....ప్రయాస....ఆశ....నిరాశ.... నష్టం.....కష్టం.....,రామా !,.....రామా !......

(డాక్టర్ వెళ్ళిపోతాడు ;)

నాలుగోనాడు...(లాయర్ ప్రవేశిస్తాడు....చేతిలో కవరుంటుంది.)

లాయర్ : మీరేనండీ ! రామారావుగారూ !

రా : అవును...

లా : మీకు వెంకట్రావుగారు ఏం కావాలి ?

రా : నాకు మామయ్య, నావైఫ్‌కు బాబయ్య... ఏమయితే నేమయ్యా...ఇదంతా మా ఖర్మయ్యా !

లా : సరేలేండి....చూడండి....సీలుచేసిన కవరండీ... మీకిమ్మన్నాడండీ :... (రామారావు చేతికి కవర్ యిస్తాడు లాయర్ ...)

శా : నే ! చెప్పలేదండీ ! బాబయ్య మనకు ఆస్థి వ్రాసి యిచ్చిన వీలునామా ఆ కవర్లో వుంటుంది... ఏమండీ ! బాబాయిగారి ఆస్థి మనచేతిలోకి వచ్చిం దంటే...నగలు, బెనారస్ చీరలు, ఇంకా ఏవేవో కొనిస్తానన్నారు. ఏమంటారు? అబ్బా ! చెప్పండి.

రా : ఆ ! నీకు చీరలు, నగలు, చాలా ! నాకేమో ఫియట్ కారు, సూటు కొంటాం. ఏమంటావ్?

శా : చూశారా ! మనముందేందుకు బంగాళ కావాలిగా ! ఏడిజైను, బాగుంటుందబ్బా !,

రా : మనం లండన్ వెళ్దాంగా !, అక్కడ మనకు ఎడిజైన్ నచ్చుతూందో చూచుకొని కట్టిద్దాం,

శా : ఛా ! లండనేమిటండీ ! ఫ్యాషనబుల్ సిటీ పారిస్ వుండగా. అక్కడ ఒక్కనిముషం గాలి పీలిస్తే,

రా : ప్యారిస్‌లో గాలితో బాటు మనడబ్బు కూడా గోవిందా ! కాబట్టి లండన్ కెళ్ళాల్సిందే,

శా : వద్దు ప్యారిస్ కెళ్ళాలి.

రా : ఛా ! లండన్ కెళ్ళాలి.

(గట్టిగా వాదులాడుకొంటారు,)

లా : చూడండి.

ఫ్రా : ప్యారిసా.

శా : లండనా?

లా : లండనూ కాదు, ప్యారిస్ కాదు, చూడండి. కవరిప్పి చూచి చదవండి.

రా : నీవు చదువు శారదా.

శా : అబ్బా! మీరే చదవండి.

లా : మీ వాదాన్ని ఆపి ఆకవరిలా యివ్వండి. నేనే చదువుతా.

ప్రియమైన రామారావుకు, శారదకు,

వెంకట్రావు చేయు ఆశీర్వాదములు.

మీరు "ఆస్తికోసం" ఆడిన నాటకానికి ప్రతిఫలంగా నా ఆస్తి మీకు చెందడంలేదు. మీకు పుట్టబోయే సంతానానికి చెందుతుంది. అంతవరకు ఆస్తి మీద వచ్చు ఆదాయం అనాధశరణాలయానికి చెందుతుంది.

ఆస్తికోసం నన్ను పూవుల్లో పెట్టి పూజించారు. ముందు చీపురుపుల్లలా చూచారు. ముఖ్యంగా మీ పుద్దేశాల్ని చూసి ఆస్తి మీకు రాయడంలేదు.

ఆశీర్వాదములతో వెంకట్రావు.

(శారద, రామారావు కుర్చీల్లో ఒకసారి కూలబడతారు నిరాశగా, "సెలవిస్తానండీ" అంటూ లాయర్ వెళ్ళిపోతాడు. ఒకేసారి కుర్చీల్లోంచి కదులుతారు.)

శా : (సిగ్గుగా,) ఏమండీ! మీకు చెప్పడం మరిచాను, నాకేమో వంట్లో పైత్యంగా వుందండి;

రా : అంటే, అంటే,

శా : (సిగ్గుతో తలవంచుకుంటుంది)

శా : అవునండీ! అంతా ఏడుకొండలవాని దయ.

రా :
శా : } మావయ్య ఆత్మకు శాంతి కల్గుగాక.

తెర వ్రాలుతుంది

సేవాతరంగిణి

శ్రీమతి ఆవుల జయప్రదాదేవి

ఆంధ్రమహిళా సభపేరుతో జననమంది. ఆంధ్ర మహిళలకేగాక, ఎల్లవారలకూ దారి చూపునదైనది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రమున వాసికెక్కి, రాష్ట్రవిభజనతో మద్రాసును ఆంధ్రులు కోల్పోయినప్పటికి, తన సేవానిరతిని, విశాల హృదయంతో, విశ్వమానవ దృక్పథంతో, నెరవేర్చుచున్నది.

ఇట్టిసంస్థకు సంస్థాపకురాలైన మన దుర్గాబాయిగారి జీవితమే ధన్యము. వారి కార్యదీక్షకు, వారిసేవానిరతికి ప్రతిబింబమే ఈ ఆంధ్రమహిళాసభ. ఈ సభ దేశానికి కావలసిన సంక్షేమ కార్యక్రమాలకు ఒకఅధ్యక్షురాలిని ప్రసాదించినది. ఈ మహిళాసభ సంస్థాపకురాలు సంక్షేమ కార్యాలకు సూత్రధారిణి కావటం ఎంతయో ముదావహం మహిళల అహోభాగ్యం.

ఈనాటి ఆంధ్రమహిళాసభ ఔన్నత్యం చూస్తే, దానికార్య రంగాన్ని పరికిస్తే, తద్వారా స్త్రీలకు లభించే సహకారాన్ని తిలకిస్తే, కేవలం ఈ విధంగా, స్త్రీజనాభ్యుదయానికి కృషిచేయడానికే శ్రీమతిదుర్గాబాయి దేశముఖ్ జనన మందారనిపిస్తుంది. ఏనాటినుండో మరుగుపడి, రాజారామమోహనరాయ్ పునః ప్రతిష్ట చేయిగా, శ్రీ వీరేశలింగం పంతులుగారు నాందీవచనాలు పలుకగా, గాంధీమహాత్మునితో ప్రారంభింపబడి, ఈనాటికి శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ చేతులలో, కార్యరూపమును ధరించిన స్త్రీలసంక్షేమ పథకపు సంపూర్ణ రూపమే ఈ ఆంధ్రమహిళాసభ.

జిలిబిలి పలుకులతో, చిన్నారిచిట్టి అడుగులతో, చిరుగజ్జెల మ్రోతలతో 1937 లో బృందావన వీధిలో ప్రారంభమయినది. తదుపరి 1940 వ సంవత్సరంలో మైలాపూర్ లజ్‌చర్చి రోడ్డులో ఆంధ్రమహాసభతో సహకరించి, ఆంధ్రమహిళలకు బాహ్యప్రపంచపు బాటలను చూపినది. అచ్చటనుండి ఇంతింతై వటుడింతై అన్నట్లు అటు పెరిగి మైలాపూరులో మద్రాసు నగరమున మహిళలందరికూ చక్కని, చిక్కని నీడయై, నిలచినది. చదువులకు ఆలవాలమై, చికిత్సాలయములకు చక్కని కేంద్రమై, శిశువిహారాలతో, పేదలపాలిటి పెన్నిధియై ఈ సభ అభివృద్ధిగాంచినది.

ఇంతఎందులకు! విశాలభావాలతో, సమభాతృత్వంతో, ఆంధ్రులు మద్రాసురాష్ట్రమునుండి తొలిగినా, తనసేవకు పరిమితికల్పించక విస్తరించినది. 1953 న ఆంధ్రరాష్ట్రావతరణ జరిగినప్పటినుండికూడా, ఎన్నో శాఖోపశాఖలుగా మద్రాసులో తనకార్య క్రమాలను సాగించుచున్న ఈసభయొక్క సమతాభావమునకు కులమతవిచక్షణలేదు. ప్రాంతీయ విభేదాలులేవు. భాషాభేదము అంతకుముందేలేదు. మానవ జాతిఅంతా ఒక్కటే. ఆ జాతిలో వెనుకబడిఉన్న స్త్రీజాతిసేవయే దీనిముఖ్యలక్షణంఅని ఎలుగెత్తిచాటి చెప్పి కార్యరూపమున చేసి చూపెట్టినదీ ఆంధ్రమహిళాసభ. వికలాంగులనుకూడా ఉపేక్షింపక, తోటి మానవులతో మేమూ జరిపించగలమనెడి ధైర్య స్థైర్యాలను కల్పించుటకు, వికలాంగుల చికిత్సాలయమును కూడ స్థాపించినది.

ఇంత విశాల దృక్పథముగల ఈ ఆంధ్రమహిళాసభ సంస్థాపకురాలి మహోన్నత సేవాతత్పరతయే దేశమున ఎందరెందరో స్త్రీలను కార్యోన్ముఖులనుచేసి, సేవానిరతులను సృష్టింపగలిగినది. సంక్షేమ కార్యక్రమాలకు మాతృమూర్తియో అననొప్పెడి ఆంధ్ర మహిళాసభ సంస్థాపకురాలిని ప్రత్యక్ష, పరోక్షగురువుగా భావించి ఎందరో సేవాపరులు ఛాయామాత్రముగా తమలోగల సేవాభావములను పురస్కరించుకొని, ఆమె అడుగు జాడలలో కార్యరంగమున కురికినారు.

ఇంతటి మహోన్నతమైన ఈమహిళాసభకు మహోజ్వలభవిష్యత్తు కలదని ఆశించుటలో ఆశ్చర్యములేదు. ఆంధ్రరాష్ట్రావతరణతో ఈసభ ఆంధ్రరాజధానీనగరమగు హైదరాబాదునగరమునకు విస్తరించినది. అతి శీఘ్రమున తన సేవచే ప్రజలదృష్టి నాకర్షించినది, స్వంతభవనములను నెలకొల్పుకొనుచున్నది. సమర్థతతో, సత్సంకల్పాలతో, హైదరాబాదు నగరమున శాఖోపశాఖలుగ విస్తరింపనున్నది. అందులకేమాత్రము సందియము లేదు. సంకల్పమాత్రమున ఏకార్యమునైననూ నెరవేర్పగల ఈ ఆంధ్రమహిళాసభ తన ఆశయ సిద్ధినొందిన పిదప ఆంధ్రప్రదేశ్ ప్రధాన పట్టణాలలోకూడ విస్తరించి, అనేక రూపాలలో రూపొందిన మహిళా కేంద్రాలను, స్త్రీల సంక్షేమ నిలయాలను సమన్వయ పరచగలదని విశ్వసించుచున్నాము. తద్వారా ఈ సేవాతరంగిణి మహిళా సంస్థలను తన చల్లని వెల్లువలో ముంచెత్తి, పునీతముగావించి, సమస్త స్త్రీజాతికీ చేయూతనీయగలదని ఆశించుచున్నాము.

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ, కాశీవిశ్వవిద్యాలయపులడ్మిషన్, ఆంధ్రామెట్రిక్, ఇ. ఎస్. ఎల్.సి., పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము	: కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ, బీద విద్యార్థినులకు ఉచితము.
మహిళా మందిరము	: విద్యార్థినులకు వసతి గృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక
నర్సింగ్‌హోమ్	: స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాల—అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణ కూడ యివ్వబడుచున్నది.
ఆర్థోపీడిక్ సెంటర్	: వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమ కేంద్రం.
ముద్రణాలయము	: విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూఫురీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్కు చేయబడును.
నాగేశ్వర శిశువిహార్	: పిల్లల విద్యావినోద కేంద్రం ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది.
వనితా బాలవిహార్	: స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం

ఆంధ్ర మహిళా సభ, హైదరాబాదు

హైదరాబాదు శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు : (1) రీజనల్ హేండిక్రాప్టుు, (2) సంక్షిప్త విద్యాప్రణాళిక, (3) చేనేత శిక్షణ– ఉత్పత్తికేంద్రము, (4) పౌర సంక్షేమ కార్యక్రమ పథకము, (5) వసతిగృహము.

అతి త్వరలో విడుదల



... Andhra Mahila Press, 7-A, Rosary Church Road